


# విజయభాను

44th వార్షికోత్సవం విజయభాను

విశాఖపట్నం, బుధవారం 14-10-2020 | VIJAYABHANU DAILY ★ VISAKHAPATNAM | సంపుటి : 44 సంచిక : 31 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## ఔషధం వచ్చేవరకూ అజాగ్రత్త వద్దు..!

### కరోనా ముప్పు ఇంకా తొలగిపోలేదన్న ప్రధానమంత్రి



దిల్లీ: దేశవ్యాప్తంగా విజృంభిస్తోన్న కరోనా వైరస్ ముప్పు ఇంకా తొలగిపోలేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరోసారి హెచ్చరించారు. దేశవ్యాప్తంగా కాస్త తగ్గుముఖం పట్టినట్లు కనిపిస్తున్నప్పటికీ, మహారాష్ట్రలో వైరస్ తీవ్రతపై ప్రధాని ఆందోళన వ్యక్తం చేశారు. ఔషధం వచ్చేవరకు వైరస్‌పై అజాగ్రత్త వద్దని సూచించారు. ఈ సమయంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు పాటించాలని విజ్ఞప్తి చేశారు.

'కరోనా వైరస్ ముప్పు ఇంకా తొలగిపోలేదు. మహారాష్ట్రలో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. ఈ సమయంలో ప్రజలు మాస్కులు ధరించడం, భౌతిక దూరాన్ని పాటించడంలో నిర్లక్ష్యం చేయొద్దు. ఒకటి మాత్రం గుర్తుపెట్టుకోండి..'ఔషధం వచ్చేవరకు అజాగ్రత్త వద్దు' అని ప్రధాని నరేంద్రమోదీ స్పష్టంచేశారు. డాక్టర్ బాలాసాహెబ్ విఖే పాటిల్ 'ఆత్మకథ'ను ఆవిష్కరించిన సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ ఈ విధంగా స్పందించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగిన ఈ కార్యక్రమంలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే కూడా పాల్గొన్నారు.

ఇదిలాఉంటే, దేశంలో రోజువారీ పాజిటివ్ కేసుల సంఖ్య కాస్త తగ్గుతున్నప్పటికీ మహారాష్ట్రలో వైరస్ తీవ్రత ఆందోళనకరంగానే ఉంది. ఇప్పటికే రాష్ట్రంలో కేసుల సంఖ్య 15లక్షలు దాటగా వీరిలో 12లక్షల 80వేల మంది కోలుకున్నారు. మరో 2లక్షల క్రియాశీల కేసులు ఉన్నాయి. దేశంలో అత్యధిక కొవిడ్ మరణాలు ఇక్కడే చోటుచేసుకుంటున్నాయి.

దేశవ్యాప్తంగా ఇప్పటివరకు లక్షా 9వేల మంది కరోనా రోగులు ప్రాణాలు కోల్పోగా, కేవలం మహారాష్ట్రలోనే 40,514మంది మృత్యువాతపడ్డట్లు కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది.

## తీవ్ర వాయుగుండంతో కోస్తాంధ్ర అతలాకుతలం



- వణికిపోయిన తీర ప్రాంతాలు
- వందల గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- పాములు, విషపురుగులతో భయం భయం

అమరావతి: పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండంతో ఏపీ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఉభయగోదావరి జిల్లాలతో పాటు విశాఖ, కృష్ణా జిల్లాలపై దీని ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. తీరం వెంబడి గంటకు 65 నుంచి 70 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తున్నాయి. ఇవాళ ఉదయం 6.30గంటల నుంచి 7.30 గంటల మధ్య కాకినాడ సమీపంలో తీవ్ర వాయుగుండం తీరం దాటినట్లు విపత్తుల నిర్వహణ శాఖ కమిషనర్

తరువాయి 2లో..

## ఏకాంతంగానే బ్రహ్మోత్సవాలు : తితిదే



తిరుమల: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు ఆలయంలోనే ఏకాంతంగా జరగనున్నాయి. ఈ ఏడాది అధికమాసం కావడంతో స్వామివారికి రెండు సార్లు బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నారు. గతనెలలో నిర్వహించిన వార్షిక ఉత్సవాలను ఏకాంతంగా ఆలయంలోనే నిర్వహించిన తితిదే.. ఈ నెల 16 నుంచి 24వ తేదీ వరకు

తరువాయి 2లో..



## ఒకటి కంటే ఎక్కువ సంస్థల నుంచి టీకా

### కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి హర్షవర్ధన్

దిల్లీ: వచ్చే ఏడాది ప్రారంభానికి భారత దేశానికి వ్యాక్సిన్ వచ్చే అవకాశం ఉందని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి హర్షవర్ధన్ ఆశాభావం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పలు సంస్థల నుంచి దేశంలో టీకా అందుబాటులో ఉండొచ్చని అన్నారు. 'ఒకటి కంటే ఎక్కువ సంస్థల నుంచి వచ్చే ఏడాది ప్రారంభానికి భారత్‌లో టీకా అందుబాటులోకి వస్తుందని అంచనా వేస్తున్నాం. మా

తరువాయి 2లో..

## లోతట్టు ప్రాంతాలను అప్రమత్తం చేయాలి

### ఏపీ డిప్యూటీ సీఎం, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఆళ్ల నాని

పశ్చిమగోదావరి జిల్లా: అల్పపీడనం ప్రభావంతో ఎడతెరపు లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీ డిప్యూటీ సీఎం, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఆళ్ల నాని ఆదేశించారు. జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలన్నారు. మంగళవారం ఉదయం జిల్లా కలెక్టర్, జిల్లా పోలీస్ అధికారులతో ఫోన్ లో మాట్లాడి వరద పరిస్థితిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేసి సురక్షిత ప్రాంతాలకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.



పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అధికారులను, ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని వెల్లడించారు. ప్రజలకు ఏ విధమైన అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. వర్షాల

తరువాయి 2లో..

## కిసాన్ రైలు రవాణాపై 50 శాతం ఛార్జీల తగ్గింపు

అనంతపురం : కిసాన్ రైలు ద్వారా రైతులు తరలించే పంట ఉత్పత్తులకు రవాణా ఛార్జీలను 50 శాతం తగ్గించటం హిందూపూరం పార్లమెంట్ సభ్యులు తలారి రంగయ్య, గోరంట్ల మాధవ్, అర్బన్ ఎమ్మెల్యే అనంతవెంకటరామిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలకు మంగళవారం వారు కృతజ్ఞతలు తెలిపారు.

అనంతపురం నుంచి ఢిల్లీ వెళ్లే కిసాన్ రైల్లో రవాణా ఛార్జీలను సగానికి సంగం తగ్గించటం వల్ల అన్నదాతలకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. అనంతలో పండే పంటలు ఢిల్లీలో అధిక ధరలకు విక్రయించి రైతులు లాభం పొందవచ్చని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు.

## తీరానికి కొట్టుకొచ్చిన భారీ నౌక



విశాఖపట్నం : బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం ప్రభావంతో రెండురోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు విశాఖ నగరం అతలాకుతలం అవుతోంది. తీరం వెంబడి బలమైన గాలులు వీస్తున్నాయి. ఈ క్రమంలోనే విశాఖ తెన్నేటి పార్క్ తీరానికి ఓ భారీ నౌక కొట్టుకుని వచ్చింది. బంగ్లాదేశ్‌కు చెందిన మర్చంట్ వెసల్ నౌక భారీ ఈదురు గాలులకు

తరువాయి 2లో..

## వర్షాలు తగ్గిన తర్వాత పంట నష్టాల ఎన్యూమరేషన్

### రాష్ట్ర వ్యవసాయ శాఖ, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి కురసాల కన్నబాబు వెల్లడి



విశాఖపట్నం : వర్షాలు తగ్గిన తర్వాత పంట నష్టాల ఎన్యూమరేషన్ ప్రారంభమవుతుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ, జిల్లా ఇన్ చార్జ్ మంత్రి కురసాల కన్నబాబు వెల్లడించారు. మంగళవారం సర్క్యూట్ హౌస్ లో జిల్లా ప్రజా ప్రతినిధుల సమన్వయ సమావేశం అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆగష్టు , సెప్టెంబరు నెలలో వర్షాలు ఎక్కువగా ఉన్నాయని, ఏలూరు, తూర్పుగోదావరి, విశాఖపట్నం జిల్లాలో పంట నష్టాలు జరిగాయని, వర్షాలు తగ్గిన వెంటనే పంట నష్టాలకు సంబంధించి ఎన్యూమరేషన్ ప్రారంభమవుతుందని ఆయన వెల్లడించారు. వేరు శనగ రైతులకు సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఏ ఒక్క రైతూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని ఆయన స్పష్టం చేశారు. అంతకు ముందు సర్క్యూట్ హౌస్ లో వివిధ సమస్యలుపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ,

తరువాయి 2లో..

## సీపీఐ సీనియర్ నేత గుండా మల్లేశ్ కన్నుమూత

హైదరాబాద్: సీపీఐ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే గుండా మల్లేశ్ (75) కన్నుమూశారు. గుండె, కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న ఆయన.. హైదరాబాద్ నిమ్స్‌లో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ప్రస్తుత మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లి నియోజకవర్గం నుంచి ఆయన నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2018

తరువాయి 2లో..

## దిగివచ్చిన బంగారం ధరలు

న్యూఢిల్లీ : గత మూడు రోజులుగా పెరిగిన బంగారం ధరలు మంగళవారం దిగివచ్చాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు తగ్గడంతో దేశీ మార్కెట్‌లోనూ పసిడి ధరలు తగ్గుముఖం పట్టాయి. ఎంసీఎక్స్‌లో పదిగ్రాముల బంగారం 237

తరువాయి 2లో..



# కొండవాలు ప్రాంతాల వారిని పునరావాస కేంద్రానికి తరలించి పరామర్శించిన కె.కె.రాజు




మురళీనగర్ : 50 వార్డు సాయిరాం నగర్, సత్యానగర్ కొండవాలు ప్రాంతాలో విశాఖ ఉత్తర నియోజక వర్గం సమన్వయకర్త కె కె రాజు మంగళవారం పర్యటించారు. కుండపోత వర్షంతో ఇబ్బందులు ఎదుర్కొంటు నివాసముంటున్న ప్రజలను జీవీఎంసీ 51 వ వార్డు పరిధి మాధవధార వద్ద నున్న మాధవ స్వామి కల్యాణ మండపానికి తరలించి బోజన సదుపాయం కల్పించారు.

కెకె రాజు మాట్లడుతూ ఇటివలే సాయిరాం నగర్ ప్రాంతంలో వర్షం దాటికి కొండ చర్యలు విరిగి పడి మూడేళ్ళ బాలిక మృతి చెందిన నేపథ్యంలో అటువంటి ఘటన పునరావృతం కాకుండ కొండవాలు ప్రాంతల్లో నివాసముంటున్న ప్రజలను పునరావాస కేంద్రలకి తరలించి వారికి సహయక చర్యలు చేపట్టామని వివరించారు .



పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామని అన్నారు

ఈ కార్యక్రమంలో 50 వార్డు కార్పోరేటర్ అభ్యర్థి వావిలపల్లి ప్రసాద్,51 వార్డు కార్పోరేటర్ అభ్యర్థి రెయ్యి వెంకట రమణ,పి.సునీత,అల్లు శంకర్ రావు,నీలి రవి,పైడి ప్రతాప్, పైడి కృష్ణా రావు మాస్టర్, A.S నాయుడు మాస్టర్,పొన్నాడ అప్పారావు, పొన్నాడ రాంబాబు,సుమతి, మాసిన లక్ష్మి,పేడాడ సత్యనారాయణ,కనమటి రఘు, రాంబాబు, త్రినాధ్, ధవళ నారాయణరావు,సీపాన రాము, వావిలపల్లి రవి, పూజారి రాము,నంబాల ఉదంతరావు , పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు




*విశాఖ పర్యటనలో ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ శ్రీనాధ్ రెడ్డి ని స్థానిక సర్క్యూట్ హౌస్ లో మర్యాద పూర్వకంగా కలుసుకొని శుభాకాంక్షలు తెలియజేస్తున్న విశాఖ దక్షిణ నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షుడు సనపల రవీంద్ర భారత్, స్టేట్ బీసీ సెల్ సెక్రెటరీ బెవర మహేష్ మరియు జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు*

# అదనపు ఆయకట్టు అభివృద్ధి కావాలి



శ్రీకాకుళం : అదనపు ఆయకట్టు అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ జె నివాస్ అన్నారు. చిన్న భూ సేకరణ సమస్యలు వలన ఆయకట్టు అభివృద్ధి ఆలస్యం జరగరాదని ఆయన పేర్కొన్నారు. వంశధార ప్రాంతంలో కొత్తూరు, భామిని మండలాలు, తోటపల్లి ప్రాజెక్టు క్రింద, హెచ్.ఎల్.సి క్రింద ఆయకట్టు అభివృద్ధి కావాలని ఆయన అన్నారు. అదనపు ఆయకట్టు, భూ సేకరణ పై కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం జిల్లా కలెక్టర్ సమీక్షించారు. హెచ్.ఎల్.సిని డిసెంబరు నాటికి పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు.

ఇంజినీర్లు పకడ్బందీగా పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ అన్నారు. భూ సేకరణ ఎట్టి పరిస్థితుల్లోనూ జాప్యం జరగరాదని ఆయన ఎస్డీసి లను ఆదేశించారు. తోటపల్లి ప్రాజెక్టు క్రింద 27 వేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందాలని అందుకు అవసరమైన భూ సేకరణ వెంటనే పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. వంశధార ఎస్ఇ డోల తిరుమల రావు మాట్లాడుతూ హై లెవెల్ కెనాల్ ద్వారా 5 వేల ఎకరాలను స్థిరీకరణతో పాటు కొత్తగా 15 వేల ఎకరాలకు ప్రతిపాదనలు పెట్టామన్నారు. 5 వేల ఎకరాలకు 10 డిస్ట్రిబ్యూటరీలు ఉన్నాయని చెప్పారు. 39 ఎకరాలు భూ సేకరణ కావలసి ఉందని చెప్పారు.

ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సుమిత్ కుమార్,

జిల్లా రెవెన్యూ అధికారి బలివాడ దయానిధి, సర్వే సహాయ సంచాలకులు కె.ప్రభాకర్, ఎస్డీసిలు బి.శాంతి, కాశీవిశ్వనాథ్, జి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

# ఆక్వా ప్రతిపాదనలు పరిశీలించాలి

శ్రీకాకుళం : జిల్లాలో ఆక్వా పరిశ్రమ ఏర్పాటుకు వచ్చిన ప్రతిపాదనలను పరిశీలించాలని జిల్లా కలెక్టర్ జె నివాస్ అన్నారు. జిల్లాలో ఆక్వా పరిశ్రమపై కలెక్టర్ కార్యాల యంలో సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ నివాస్ సమీక్షించారు. ఆక్వా పరిశ్రమ స్థాపనకు వచ్చిన దరఖాస్తులు వివరంగా పరిశీలించాలి. పరిశ్రమలకు ప్రతిపాదనలు వచ్చిన స్థలాల్లోను, సమీపంలోను తాగునీటి వసతులు, తదితర సౌకర్యాలు ఉంటే వాటికి కలిగే అవరోధాలు గుర్తించాలని ఆదేశించారు. కాలుష్యం ప్రభావం పరిశీలించాలని ఆయన అన్నారు. వినియోగించే ఆహార పదార్థాలు, ఆక్వా చెరువుల నుండి విడిచిపెట్టే నీటి మార్గాలు, తద్వారా కలిగే కాలుష్య ప్రభావం కూడా పరిశీలించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. సంతబొమ్మాలి, కవిటి, పోలాకి, శ్రీకాకుళం, ఎచ్చెర్ల, గార, సోంపేట, వజ్రపు కొత్తూరు మండలాల్లో 73.35 హెక్టార్లలో 85 నూతన ఆక్వా పరిశ్రమలను ఏర్పాటు చేయుటకు, సంతబొమ్మాలి, పోలాకి, శ్రీకాకుళం మండలాల్లో 9.50 హెక్టార్లలో గల 10 ఆక్వా పరిశ్రమలను రెన్యూవల్ చేయుటకు జిల్లా స్థాయి కమిటీలో పరిశీలించారు.

ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి బలివాడ దయానిధి, మత్స్యశాఖ ఇన్ ఛార్జ్ సంయుక్త సంచాలకులు పివి శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు కె. శ్రీధర్, కాలుష్య నియంత్రణ మండలి ఇఇ ఎస్.శంకర్ నాయక్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి జి.చక్రధర రావు, ఆక్వా పరిశ్రమల సంఘం ప్రతినిధి సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి పేదవారికి ఇల్లు కేటాయించాలి



గాజువాక: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న హౌసింగ్ పథకంలో అర్హులైన ప్రతి పేదవారికి ఇల్లు కేటాయించాలని జీవీఎంసీ గాజువాక జోనల్ -5 లొ సంబంధిత అధికారిని యు సి డి ఓ ఏపీడిఓ రజనీకు జీవీఎంసీ 87 వ వార్డు వైసీపీ అభ్యర్థిని ప్రగడా విజయలక్ష్మి ఆధ్వర్యంలో ముద్దపు దామోదర్ రావు, దుగ్గపు దానప్పలు, గాలి ఆనంద్ తదితరులు కలిసి మంగళవారం వినతిపత్రం ద్వారా అభ్యర్థించారు. ఈ సందర్భంగా ప్రగడ విజయలక్ష్మి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో సొంతఇంటి కోసం చాలామంది ప్రజలు డిడి ల రూపంలో ప్రభుత్వం నిర్దేశించిన నగదును చెల్లించారని, ఇప్పుడు ప్రభుత్వం డిడి లు కట్టిన వారితోపాటు, కొత్తగా రేషన్ కార్డులు వచ్చి ఇల్లు లేని నిజమైన లబ్ధిదారులను గుర్తించి ప్రభుత్వం ఇచ్చే ఇల్లును ఇప్పించాలని కోరారు. అలాట్ అయిన హౌసింగ్ లిస్టు సచివాలయం సిబ్బంది సచివాలయం లో అందరికి అందుబాటులో ఉంచాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేయడం జరిగిందని తెలిపారు. ఎమ్మెల్యే నాగిరెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో 87వార్డ్ వైస్సార్సీపీ వైసీపీ నాయకులు మద్దపు దామోదర్,ప్రగడ శ్రీనువాసు, ఈలపు రాము బోండా గోవింద్ రాజులు, ఆడారి శ్రీనివాస్, కాండ్రేగుల కృష్ణ, ప్రగాడ రాము, దాసరి అప్పుడు, కారణం లక్ష్మి, పాపారావు, కె.పరిపాలి,వి ఈశ్వరావు, ఎస్.ఈశ్వరావు తదితరులు పాల్గున్నారు.

# వర్షాలు తగ్గిన తర్వాత పంట నష్టాల ఎన్యూమరేషన్

జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి కురసాల కన్నబాబు, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, రాజ్య సభ సభ్యులు వి. విజయ సాయిరెడ్డి, పార్లమెంటు సభ్యులు ఎం.వి.వి. సత్యనారాయణ, బి.వి. సత్యవతి, జిల్లా కలెక్టర్ వి. వినయ్ చంద్, డి.ఐ.జి. కాళీదాసు రంగారావు, నగర పోలీసు కమీషనర్ మనీష్ కుమార్ సిన, జిల్లా ఎస్.పి. బి. కృష్ణారావు, శాసన సభ్యులు గుడివాడ అమర్ నాథ్, కన్నబాబురాజు, వాసుపల్లి గణేష్ కుమార్, అదీప్ రాజ్, కరణం ధర్మశ్రీ,

గొల్ల బాబూరావు, భాగ్యలక్ష్మి, ఫాల్గుణ, మాజీ శాసన సభ్యులు మళ్ల విజయ ప్రసాద్, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె. రాజు, రాష్ట్ర కార్యదర్శి రొంగలి జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

# దిగివచ్చిన బంగారం ధరలు



రూపాయలు పతనమై 50,870 రూపాయలకు దిగిరాగా వెండి కిలోకు 525 రూపాయలు పతనమై 62,573 రూపాయలు పలికింది. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధరలు ఔన్స్‌కు 1919 డాలర్లకు పడిపోయాయి. బంగారం ధరలు మరింత పతనమయ్యే దశలో కరోనా వైరస్ కేసులు ప్రబలడం, జాన్సన్ అండ్ జాన్సన్ వ్యాక్సిన్ పరీక్షలు నిలిచిపోవడంతో గోల్డ్ ధరలు కొంతమేర పుంజుకున్నాయి. ఇక అంతర్జాతీయ అనిశ్చితి పరిస్థితులు, ఉద్దీపన ప్యాకేజ్‌లపై అస్పష్టతతో బంగారం ధరలు మరికొంత కాలం ఒడిదుడుకులతో సాగుతాయని బులియన్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

మొదటి పేజీ తరువాయి

# తీవ్ర వాయుగుండంతో కోస్తాంధ్ర అతలాకుతలం

కన్నబాబు తెలిపారు. అలల ఉద్ధృతి ఎక్కువగా ఉన్నందున సముద్రంలోకి మత్స్యకారులెవరూ వేటకు వెళ్లొద్దని హెచ్చరించారు. వచ్చే ఐదారు గంటలపాటు పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాలపై వాయుగుండం తీవ్ర ప్రభావం చూపే సూచనలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఇది భూభాగంపైకి రావడంతో పశ్చిమగోదావరి, కృష్ణ, తెలంగాణ జిల్లాల్లో విస్తృత ప్రభావం చూపుతోంది. విశాఖ, తూర్పుగోదావరి జిల్లాల్లో కొంతమేర వర్ష ప్రభావం తగ్గినట్లు అధికారులు తెలియజేశారు.

**వణికిపోయిన తీర ప్రాంతాలు**

వాయుగుండం ప్రభావంతో తూర్పుగోదావరి జిల్లాలోని తీర ప్రాంతాలు వణికిపోయాయి. ప్రస్తుతం జిల్లాలో కొంతమేర వర్ష ప్రభావం తగ్గింది. జనజీవనానికి కాస్త ఊరట దొరికింది. వర్షాలతో రాజమహేంద్రవరంలోని కాలనీలు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కోటిపల్లి బస్టాండ్, ఐఎల్‌టీడీ జంక్షన్, కంబాల చెరువు, రైల్వేస్టేషన్ రోడ్డు నీట మునిగాయి. డ్రైనేజీలు పొంగిపొర్లి రోడ్లపైకి రావడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రాత్రి నుంచి కురిసిన వానకు లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచింది. బొమ్మూరులో గోడ కూలి ఓ మహిళ మృతి చెందారు. తునిలో తాండవ నది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. కోటనందూరు, కొట్టాం, తుని, కొలిమేరు రోడ్లపై నీరు చేరింది. పూరిళ్లు ధ్వంసమయ్యాయి. అనేక మంది నిరాశ్రయులయ్యారు. వర్షం కారణంగా రావులపాలెం బస్టాండ్ చెరువును తలపిస్తోంది. కాకినాడ, ఉప్పాడ తీరంలో కెరటాలు ఎగసిపడుతున్నాయి. తీరప్రాంత గ్రామాల్లో కొన్ని ఇళ్లు కోతకు గురయ్యాయి. జగ్గంపేటలో ఎస్సీ కాలనీని నీరు చుట్టుముట్టింది. మురుగుకాల్వల నీరు రోడ్లపైకి చేరి అస్తవ్యస్తంగా మారింది.

**వందల గ్రామాలకు నిలిచిన రాకపోకలు**

పశ్చిమగోదారివరిపైనా తీవ్రవాయుగుండం ప్రభావం ఎక్కవగా ఉంది. జంగారెడ్డి గూడెం, బుట్టాయగూడెం, టీ నర్సాపురం, తడిగెలపూడి, గోపాలపురం, కొయ్యలగూడెం, కొవ్వూరు, పోలవరం మండలాల్లో వాగులు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. వందల గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. జంగారెడ్డి గూడెం మండలం పట్టన్నపాలెంలో జల్లేరువాగు పొంగి ప్రవహిస్తోంది. బైనేరు, సుద్దవాగు, ఎర్రకాలువ ప్రమాదకరంగా ప్రవహిస్తున్నాయి. ఎర్రకాలువ జలాశయం నుంచి 15వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. పోలవరం, జంగారెడ్డి గూడెం, కొయ్యలగూడెం మండలాల్లో వేల ఎకరాల్లో వరి, పొగాకు నారు మళ్లు దెబ్బతిన్నాయి. తడికెల పూడిలో చేపల వేటకు వెళ్లి వాగులో పడి 55 సంవత్సరాల వ్యక్తి గల్లంతయ్యారు.

**పాములు, విషపురుగులతో భయం భయం**

తీవ్ర వాయుగుండం ప్రభావంతో కృష్ణా జిల్లా అంతటా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. విజయవాడలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. చాట్రాయి మండలంలో కురిసిన భారీ వర్షాలకు రహదారులపై వరద ప్రవహిస్తోంది. జనజీవనం అస్తవ్యస్తంగా తయారైంది. తిరువూరులో లోతట్టు ప్రాంతాలు, నివాస గృహాలు ముంపునకు గురయ్యాయి. బాపులపాడు మండలం కొత్తపల్లిలో ప్రధాన రహదారులు జలదిగ్బంధమయ్యాయి. నూజివీడు మండలం యనమదలో మోకాళ్ల లోతు నీరు చేరింది. వరదతో విషపురుగులు, పాములు రావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. హనుమాన్ జంక్షన్‌లో భారీ వర్షం కురిసింది. వర్షపునీటితో 16వ నంబరు జాతీయ రహదారిపై భారీగా నీరు చేరింది. విజయవాడ శివారు రాజీవ్‌నగర్ కట్ట సమీపంలో కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. సమీపంలోని బుడమేరు కాల్వ పొంగడంతో వరదనీరు ఇళ్లలోకి చేరి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రకాశ్‌నగర్, ఎల్వీఎస్‌నగర్‌లో రెండు అడుగుల మేర వరద నీరు చేరింది. బుడమేరు వరద తగ్గితేనే మోటార్లు పెట్టి నీరు తోడుతామని అధికారులు చెబుతున్నారు.

# ఒకటి కంటే ఎక్కువ సంస్థల నుంచి టీకా

నిపుణుల బృందాలు టీకా పంపిణీకి సంబంధించిన ప్రణాళికను సిద్ధం చేస్తున్నాయి' అని మంత్రి వెల్లడించారు. భారత జనాభా దృష్ట్యా కేంద్రం ఒకటి కంటే ఎక్కువ టీకా అభివృద్ధి సంస్థలతో జట్టు కట్టాల్సిన అవసరం ఉందని సండే సంవాద్ తాజా ఏపిసోడ్‌లో మంత్రి ప్రజలకు వెల్లడించిన సంగతి తెలిసిందే.

ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) చీఫ్ సైంటిస్ట్ సౌమ్యా స్వామినాథన్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. టీకా 2020 చివరిలో, వచ్చే ఏడాది ప్రారంభంలో రిజిస్ట్రేషన్‌కు సిద్ధంగా ఉండొచ్చన్నారు. 'ప్రస్తుతానికి, సుమారు 40 టీకాలు వివిధ దశల్లో క్లినికల్ ట్రయల్స్ ప్రయోగాల స్థాయిలో ఉన్నాయి. వాటిలో 10 టీకాలు మూడో దశకు చేరుకున్నాయి. దాదాపుగా చివరి దశ. ఇది మనకు వాటి భద్రత, సమర్థతను తెలియజేస్తున్నాయి' అని ఆమె తెలిపారు.

ఇదిలా ఉండగా, గడచిన 24 గంటల్లో 55,342 కొత్త కేసులు నమోదు కాగా.. దేశంలో మొత్తం కేసుల సంఖ్య 71,75,881కి చేరింది. వీరిలో ఇప్పటివరకు 62,27,296 మంది వైరస్ నుంచి కోలుకుని ఇళ్లకు వెళ్లారు. ఇక గత 24 గంటల్లో మరో 706 మంది కరోనాకు బలయ్యారు. దీంతో మొత్తం మరణాల సంఖ్య 1,09,856కి పెరిగినట్లు కేంద్ర ఆరోగ్య శాఖ మంగళవారం వెల్లడించింది.

# ఏకాంతంగానే బ్రహ్మోత్సవాలు : తితిదే

జరగనున్న నవరాత్రి ఉత్సవాలను తిరువీధుల్లో భక్తుల మధ్య నిర్వహించాలని ముందుగా భావించి అందుకు తగిన ఏర్పాట్లు చేసింది.

అయితే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తాజాగా వెల్లడించిన కొవిడ్-19 నిబంధనలకు అనుగుణంగా నవరాత్రి ఉత్సవాలను ఈసారి కూడా ఏకాంతంగానే నిర్వహించనునన్నట్లు మంగళవారం తితిదే ప్రకటించింది. ఈవో జవహర్‌రెడ్డి అధ్యక్షతన తితిదే ఉన్నతాధికారులు పలు మార్లు సమీక్షలు నిర్వహించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తితిదే తెలిపింది. చిత్తూరు జిల్లాలో కరోనా కేసులు పెరుగుతుండటం.. ఉత్సవాలు, మతపరమైన కార్యక్రమాలకు 200 మందికి మించి నిర్వహించకూడదని ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ నూతన మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు స్పష్టం చేశారు.

# లోతట్టు ప్రాంతాలను అప్రమత్తం చేయాలి

తీవ్రత అధికంగా ఉన్న ప్రాంతాలలో జిల్లా యంత్రాంగం, పోలీస్ శాఖ ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. జిల్లా రెవిన్యూ శాఖ పోలీస్ యంత్రాంగం సమన్వయంతో ఇతర శాఖలను అప్రమత్తం చేయాలని సూచించారు. భారీ వర్షాలు కారణంగా అంటూ వ్యాధులు ప్రబలకుండా ముందుగానే అన్ని ప్రాంతాల్లో మెడికల్ టీమ్స్ ఏర్పాటు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. అవసరం ఉన్న ప్రాంతంలో మెడికల్ క్యాంపు లు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు పడుతున్న దృష్ట్యా ప్రజలు అనవసరంగా బైటికి రావద్దని సూచించారు. కరోనా నిబంధనలు పాటిస్తూ లోతట్టు ప్రాంతంలో ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. అదేవిధంగా తమ్మిలేరుకు వరద ఉధృతి పెరిగింది. అక్కడ 5000 క్యూసెక్కుల వరద నీరు వచ్చే అవకాశం ఉంది. దీంతో ఏలూరు తమ్మిలేరుకు ఇరు వైపుల ఉన్న ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. ఏలూరులోని లోతట్టు ప్రాంతంలో జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు చేపట్టండి అని ఆయన అధికారులను ఆదేశించారు.

మంగళవారం ఉదయం 6:30 నుంచి 7: 30 మధ్య కాకినాడకు అతి సమీపంలో వాయుగుండం తీరం దాటిందని విపత్తుల శాఖ కమిషనర్ కె. కన్నబాబు తెలిపారు. ఈ కారణంగా భారీ వర్షాలు పడే అవకాశం ఉందని అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# సీపీఐ సీనియర్ నేత గుండా మల్లేశ్ కన్నుమూత

ముందస్తు అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఎమ్మెల్యేగా పోటీ చేసినప్పటికీ ఓటమి పాలయ్యారు. పార్టీలో కింది స్థాయి నుంచి జాతీయ స్థాయి నాయకుడిగా ఎదిగిన ఆయన.. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేశారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ నాయకుడిగా కార్మికుల మన్ననలు పొందారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడిగా, కార్యవర్గ సభ్యుడిగా, జాతీయ కమిటీ సభ్యుడిగా మల్లేశ్ పనిచేశారు.

సీనియర్ నేతల సంతాపం

గుండా మల్లేశ్ మృతి పట్ల సీపీఐ నేతలు సంతాపం వ్యక్తం చేశారు. సీనియర్ నేతలు డి.రాజా, నారాయణ.. రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డితో పాటు అజీజ్‌పాషా తదితరులు ఆయన మృతికి సంతాపం తెలిపారు. పార్టీకి ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. మల్లేశ్ కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన భౌతిక కాయాన్ని సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌కు తరలించనున్నారు. అక్కడ వామపక్ష పార్టీలకు చెందిన నేతలు కార్యకర్తలు నివాళు లర్పించనున్నారు. అనంతరం మల్లేశ్ పార్థివ దేహాన్ని బెల్లంపల్లి తరలించి అంతిమ సంస్కారాలు నిర్వహించనున్నారు.

# వర్ష భీభత్సానికి తీరానికి కొట్టుకొచ్చిన భారీ నౌక

కొట్టుకువచ్చింది. గాలితీవ్రత ఎక్కవగా వుండటంతో ప్రతికూల పరిస్థితుల్లో ఒడ్డుకు చేరుకున్న 80 మీటర్ల పొడవాటి నౌక పార్క్ సమీపంలోని రాళ్లలో చిక్కుకుంది. అర్ధరాత్రి సమయంలో ఇసుక తిన్నెల మధ్య చిక్కుకోగా.. నౌకలోని సిబ్బంది సురక్షితంగా బయటపడ్డారు. యాంకర్లు రెండూ కోల్పోవడంతో ఏర్పడిన సమస్య తలెత్తినట్లు అధికారులు చెబుతున్నారు. విషయం తెలుసుకున్న నేవీ అధికారులు, పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని నౌకను బయటకు తీసేందుకు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు నౌకను చూసేందుకు స్థానికులు పెద్ద ఎత్తున తీరానికి చేరుకుంటున్నారు.

# 45వార్డు లో కె.కె.రాజు పర్యటన



కంచరపాలెం : విశాఖ ఉత్తర నియోజకవర్గం 45వార్డులో అల్లూరి సీతారామ రాజునగర్ విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు మంగళవారం ఉదయం పర్యటించారు. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి ఈ ప్రాంతంలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమస్యలును తెలుసుకొని వారిని పరామర్శించారు. వారి కోసం45 వార్డు అధ్యక్షుడు పైడి రమణ ఏర్పాటు చేసిన అల్పాహారం కె కె రాజు పలువురికి వడ్డించారు. అధికారులతో మాట్లాడి సహాయక చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో 45వార్డు అధ్యక్షుడు పైడి.రమణ, సన్నీ , పైడి నాగరాజు, దుర్గ, నాయుడు, రావూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఎస్డీఐ విద్యార్థుల
# కోవిడ్-19 ప్రతిజ్ఞ



విశాఖపట్నం : కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరిస్తూ మంగళవారం దీనదయాళపురంలోని స్కిల్ డెవలప్ మెంట్ ఇనిస్టిట్యూట్ విద్యార్థులు కోవిడ్-19 ప్రతిజ్ఞ చేశారు. కోవిడ్ వ్యాప్తి చెందే అన్ని అవకాశాలను గుర్తెరిగి, తనతో పాటు తోటివారికి కూడా హాని జరుగకుండా అన్ని ముందస్తు చర్యలను ఆచరిస్తామని, తప్పనిసరిగా కనీసం 6 అడుగుల దూరం పాటిస్తూ, మాస్కులు, ఫేస్ షీల్డులు వాడుతూ, తరచూ చేతులను సబ్బు నీటితో పరిశుభ్రంగా వుంచుకుంటామని శపథం చేశారు. ఈ సందర్భంగా డీజీఎం నరసింహ దాసు మాట్లాడుతూ సంస్థలో కోవిడ్ జాగ్రత్తలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, శిక్షణా కార్యక్రమాలు సురక్షితంగా సాగేలా ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఇన్స్టిట్యూట్ లోకి ప్రవేశించే ప్రతి ఒక్కరు సునిశితంగా పరిశీలించబడతారని, అనవసర కదలికలని వీలైనంత వరకు నియంత్రిస్తున్నామని చీఫ్ మేనేజర్ మహేష్ చెప్పారు.కార్యక్రమంలో 60 మంది విద్యార్థులతో పాటు శ్రీనివాస్, కిరణ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వర్షాలుతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



అచ్యుతాపురం : వర్షాలుతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని వైసిపి నాయకులు, ఎంపిటీసీ అభ్యర్థి రావి శోభన్‌బాబు కోరారు. మంగళవారం ఎం.జగన్నాథపురం లో ముంపునకు గురైన పంట పాలాలను ఏఈఒ కె బి సూర్యనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా శోభన్ మాట్లాడుతూ గ్రామాలలో ముంపునకు గురైన పంట పొలాలను అంచనా వేసి రైతులకు నష్టపరిహారం అందేలా చూడా లన్నారు.

ఈ కార్యక్రమంలో...

వ్యవసాయ సహాయకులు లోకేష్, విఆర్ఒ గౌరి, భీముని నాగేశ్వరరావు, గొర్లి శ్రీనివాసరావు, బుదిరెడ్డి భాస్కరావు, సురంగల్ కాశి తదితరులు ఉన్నారు.

# బాధితులకు సీపీఐ నేతల పరామర్శ



వర్షం వల్ల కూలిపోయిన ఇళ్లను పరిశీలించిన సీపీఐ నగర సమితి నాయకులు

గాజువాక : రెండు రోజులుగా కురుస్తున్న భారీవర్షాల వల్ల గాజువాక మండలంలోని పలు ఇళ్లు కూలిపోయాయి మంగళవారం సీపీఐ నగరసమితి ఆధ్వర్యంలో గాజువాక మండల పరిధిలోని సంజీవగిరి కాలనీ, భానోజీ కాలనీ లోని పూర్తిగా దెబ్బతిన్న ఇళ్లను నాయకులు పరిశీలించారు. నేలమట్టమైన ఇళ్ల యజమానులను సీ.పీ.ఐ నేతలు పరామర్శించి వివరాలను తెలుసుకున్నారు. వాయుగుండం వలన రెండు రోజులుగా గాజువాక లోని పలు ప్రాంతాలు నీట మునిగాయి. పలు ఇళ్లు వర్షానికి దెబ్బతిన్నాయి. సంజీవగిరి కాలనీ, భానోజీ కాలనీ లో ఇళ్లు పూర్తిగా దెబ్బతిన్న బాధితులు మునసా పెంటమ్మ, వరలక్ష్మి తదితరుల ఇళ్లను సీ.పీ.ఐ నగర సమితి కార్యదర్శి మరిపల్లి పైడి రాజు, సహాయ కార్యదర్శి కె.సత్యాంజనేయ, కార్యవర్గ సభ్యులు కసిరెడ్డి సత్యనారాయణ, జి.రాంబాబు, పి.దుర్గారావు తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా పైడి రాజు మాట్లాడుతూ ప్రభుత్వం, రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి బాధితులకు నష్టపరిహారం అందించాలని కోరారు.

## బీచ్ ప్రాంతంలో ఓపెన్ గా ఉన్న
# ఎలక్ట్రిక్ జంక్షన్ బాక్స్

భీమునిపట్నం : భీమిలి బీచ్ పార్కు యందు ఎల క్ట్రిక్ జంక్షన్ బాక్స్ ఓపెనుగా ఉండడంతో బీచ్ ను సందర్శించే సందర్శ కులు భయాందోళనకు గురవుతున్నారు.అధికారులు ఇంతవరకూ చూడకపోవడం గమనార్హం అని స్థానికులు అంటున్నారు. అది ఎంత ప్రమాదకరమో ప్రతీరోజూ పిల్లలు ఈ ప్రాంతంలో ఉండడంతో వారికి ప్రమాదం జరుగుతుందనీ ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా తగు జాగ్రత్తలు తీసుకుంటారని భీమునిపట్నం జోనల్ కమీషనర్‌ని స్థానికులు కోరుతున్నారు.



# వర్షాలకు కూలుతున్న వంతెన



భీమునిపట్నం : గత రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు తగరపు వలస జాతీయ రహదారిలో నూతనంగా నిర్మిస్తున్న వంతెన లో వేసిన కశర్ మట్టి కరిగి శకలాలు విరిగి పోతున్నాయి. అయితే ఈ వర్షాలు కు వంతెన శకలాలు విరిగిపోయి రోడ్డు మీద పడిపోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయనీ వాహన దారులు వాపోతున్నారు. పగలు కొంత ఇబ్బందులు ఉన్న రాత్రివేళల్లో జరగడం తో వీధిదీపాలు వంతెన ఇరువైపులా లేక వాటిని వాహన చోదకులు తప్పించుకు వెళ్ళడం కష్టమవు తుందని వాపోతున్నారు. గతములో కూడా ఒక టిప్పర్ పైనుండి తిరగబడడం తో ఏ ఒక్కరికీ ఏటువంటి ప్రమాదం జరగలేదు. వర్షం పడితే ఈ వంతెన పనుల వల్ల రోడ్లు చిత్తడి చిత్తడి గా మారి పోయి వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు.

ట్రాఫిక్ ఇక్కడికక్కడే జాం అవుతుంది. సంబంధిత అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

## పొంగి పొర్లుతున్న గోస్తనీ నది

అనంతగిరి : అనంతగిరి మండలంలోని భీంపోలు పంచాయితీలోగల లువ్వ గ్రామం వద్ద సుమారు 35సంవత్సరాల క్రితం చిన్నబ్రిడ్జి (కాజ్ వే) నిర్మించారు వర్షంవచ్చిన ప్రతీసారీ గోస్తనీ గెడ్డం రావడం బ్రిడ్జి పైనుంచి రావడం వలన భీంపోలు పంచాయతీ లో ఆరు గ్రామాల ప్రజలు,గుమ్మకోట,గరుగుబిల్లి, పంచాయతీలో గల అన్ని గ్రామాల ప్రజలు అనంతగిరి, మండలకేంద్రంనకు వెళ్లాలన్న నిత్యావసర సరుకులకు, శృంగవరపుకోట వెళ్లాలన్నా దారిలేకుండా ఉంది ప్రభుత్వాధికారులు స్పందించి దువ్వి వద్ద గోస్తననీ నదిపై వంతెన నిర్మించాలని భీంపోలు,గుమ్మకోట,గరుగుబిల్లి గ్రామప్రజలు కోరుతున్నారు.

## పూడిమడక తీరంలో పర్యటించిన ఏఎస్పి



అచ్యుతాపురం : తుఫాన్ నేపద్యంలో ఏఎస్పి తుహిన్ సిన్హా పూడిమడక సముద్రతీరంలో, కాజీపాలెం గ్రామంలో మంగళవారం పర్యటించారు. గ్రామాలలో గల పరిస్థితులను గ్రామపెద్దలను అడిగి తెలిసికున్నారు. ఏఎస్ పి తో పాటు సీఐ నారాయణరావు, ఎస్ఐ లక్ష్మణరావు తదితరులు ఉన్నారు.

## వర్షాలతో కూరుకుపోయిన బ్రిడ్జి



గొలుగొండ : గొలుగొండ మండలం ఏటి గైరంపేట పంచాయతీ శివారు సీతకండి గ్రామంలోకి వెళ్లి రోడ్డు మార్గంలో బ్రిడ్జి కురుకుపోవడంతో వాహనాలకు అంతరాయం ఏర్పడింది... గత వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు బ్రిడ్జి వద్ద పూర్తిగా రిటర్నింగ్ వాలు కొట్టుకుపోవడంతో రోడ్డు మొత్తం మరమ్మతులు గురయ్యాయి.

# ప్రజల మనసులో ద్రోణంరాజు శ్రీనివాస్ చిరస్థాయిగా నిలిచిపోతారు

## ఎంపీ విజయసాయిరెడ్డి



విశాఖపట్నం : మాజీ ఎమ్మెల్యే, విశాఖ మెట్రో రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ(వీఎంఆర్డీఏ) మాజీ చైర్మన్ ద్రోణంరాజు శ్రీనివాస్ ఆరోగ్యం గురించి సీఎం వైఎస్ జగన్ ఎప్పటికప్పుడు ఆరా తీశారని ఆయన కుమారుడు శ్రీవత్సవ అన్నారు. తన తండ్రి అనారోగ్యానికి గురైతే.. పార్టీ అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించిందని గుర్తుచేశారు. మంగళవారం విశాఖలోని ఉడా చిల్డ్రన్ థియేటర్‌లో ద్రోణంరాజు సంస్మరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు విజయ్‌సాయిరెడ్డి, మంత్రులు అవంతి శ్రీనివాస్, కన్నబాబు, ఎంవీవీ సత్యనారాయణ.. సత్యవతి, గుడివాడ అమర్‌నాథ్, అదీప్‌రాజు, గొల్ల బాబూరావు, భాగ్యలక్ష్మి, కార్యకర్తలు పాల్గొని ద్రోణంరాజు శ్రీనివాస్ చిత్ర పటానికి పుల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన కుమారుడు శ్రీవాత్సవ మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ తమకు అండగా నిలిచారని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్ ప్రేమ అనేది స్వచ్ఛంగా ఉంటుందని చెప్పారు. పార్టీలో ఆలస్యంగా చేరిన తన తండ్రికి సీఎం జగన్ ఎమ్మెల్యే సీటు ఇచ్చారని గుర్తుచేశారు. తన నాన్న ఆరోగ్యం గురించి ఆయన ఎప్పటికప్పుడు ఆరా తీశారని చెప్పారు. మెరుగైన వైద్యం అందించమని ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. దురదృష్టవశాత్తు తన తండ్రి చనిపోయారని అన్నారు. ఎంపీ విజయసాయిరెడ్డి, జిల్లా మంత్రి, ఎమ్మెల్యేలు తమకు అండగా నిలిచారని చెప్పారు.

సంస్మరణ సభలో ఎంపీ విజయసాయిరెడ్డి మాట్లాడుతూ.. ప్రజల మనసులో ద్రోణంరాజు శ్రీనివాస్ చిరస్థాయిగా నిలిచిపోతారని తెలిపారు. చివరిసారిగా తనకు ద్రోణంరాజు శ్రీనివాస్ ఫోన్ చేసి శ్రీవత్సవను బాగా చూసుకోవాలని చెప్పారని తెలిపారు. ద్రోణంరాజు కుటంబానికి పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. సీఎం వైఎస్ జగన్ ద్రోణంరాజు కుటుంబానికి అండగా ఉంటారని చెప్పారు. శ్రీవత్సవ తన తండ్రి బాటలోనే నడవాలని కోరుకుంటున్నానని అన్నారు. మంత్రి అవంతి శ్రీనివాస్ మాట్లాడుతూ. ద్రోణంరాజు శ్రీనివాస్ మరణం చాలా బాధాకరమని, విశాఖ నగరంతో విడదీయరాని బంధం ద్రోణంరాజు కుటుంబానికి ఉందని తెలిపారు. పార్టీ తరుపున ద్రోణంరాజు కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు. అదే విధంగా మంత్రి కన్నబాబు మాట్లాడుతూ.. ద్రోణంరాజు సంస్మరణ సభలో పాల్గొటనని ఎన్నడూ అనుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తన అనే మనుషులను ఎన్నడూ సీఎం జగన్ వదులుకోరని తెలిపారు. వైఎస్, ద్రోణంరాజు కుటంబానికి ఎంతో సన్నిహిత సంబంధం ఉందని గుర్తుచేశారు. ఎన్నికల్లో ద్రోణంరాజు ఓడిపోయినప్పటికీ సీఎం జగన్ వీఎంఆర్డీఏ చైర్మన్ పదవినిచ్చి గౌరవించారని చెప్పారు.

# మోడీ ప్రభుత్వం సూచించిన
# మూడు రక్షణ కవచాల సూత్రాలు అందరూ పాటించాలి

విశాఖపట్నం : ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన అన్లాక్ ప్రక్రియ కరోనాను అరికట్టేందుకు దోహదపడుతోందని ఉత్తరాంధర జిల్లాల కోవిడ్ నోడల్ అధికారి, ఎఎంసి ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వి. సుధాకర్ అన్నారు. ”జన్ ఆందోళన్ కరోనా అప్ర్పోప్రైట బిహేవియర్ “ పై కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ కు చెందిన రీనల్ ఔట్ రీచ్ బ్యూరో, ఆకాశవాణి వార్త విభాగం సంయుక్తంగా ఏర్పాటు చేసిన జాతీయ వెబ్‌నార్‌లో సుధాకర్ మాట్లాడారు. “జన ఆందోళలన్ కరోనా అప్ప్రొప్రైట బిహేవియర్, పేరిట మోడి ప్రభుత్వం సూచించిన మూడు రక్షణ కవచాల సూత్రాలు అందరూ పాటించాలని చెప్పారు. మానసిక ఆరోగ్య సంరక్షణను ఆ సూత్రాలు పెంచుతాయని పేర్కొన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రారంభించిన ఈ కార్యక్రమం మంచి ఫలితాలను ఇస్తుందని అన్నారు.కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ రీనల్ ఔట్ రీచ్ బ్యూరో అడిషనల్ డైరెక్టర్ జనరల్ డి. మురళి మోహన్ మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన అవగాహన కార్యక్రమం ఏంతో ప్రాధాన్యతను సంతరించుకుందని అన్నారు. కరోనా కారణంగా 6 నెలల గా ఎదుర్కున్న అనుభవాలను పొందుపరుచుకోవాలని తెలిపారు. “మాస్క్ ధరించడం అంటే గౌరవ సూచిక అని, తమని రక్షిస్తుందని, 6 అడుగుల సామాజిక దూరం, సబ్బుతో 20 సెకన్లు చేతులు కడుక్కోవడం, శుభ్రత పాటించడం కరోనాను ఎదుర్కొవడానికి ఒక బృహత్తర ప్రణాళిక అని అభివర్ణిం చారు. విశాఖపట్నం ప్రభుత్వ మానసిక సంరక్షణ ఆసుపత్రి సూపెరెండెంట్ సైకి యాట్రిస్ట్, డాక్టర్ రాధ రాణి, మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్దేశించిన మూడు రక్షణ సూత్రాలు, మానసిక స్థితిని మెరుగుపరుచు కోవడానికి ముఖ్యమని చెప్పారు. కుటుంబం, స్నేహితులు, బంధువుల మద్దతు, కరోనా నేపథ్యం లో పలు సమస్యలను పరిష్కరించడానికి సహాయపడతాయని అన్నారు. కరోనా మహమ్మారికి వ్యతిరేకంగా పోరాడటానికి వ్యాయామం, నిద్ర, యోగా, ధ్యానం మరియు అభిరుచుల ముఖ్యమని ఆమె అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో రీజినల్ అవుట్ రీచ్ బ్యూరో అసిస్టెంట్ డైరెక్టర్ ఎం. శ్రీనివాస్ మహేష్, బి. తారకా ప్రసాద్, ఎఫ్. పి. ఓ, నెల్లూరు, ఐ%డ% బి అధికారులు వెబ్‌నార్‌లో పాల్గొన్నారు.


**GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION** VIZAG

స్వచ్ఛ ఆంధ్ర | స్వచ్ఛ విశాఖ

**SHORT TENDER NOTICE**

The GVMC is inviting sealed tenders from firms **(-or-)** registered contractors for 3 Months Maintenance of Bio remediation treatment of Municipal Solid Waste Transfer Station at MSF-V Zone-V GVMC for maintenance of Bad Odour control & Wet Waste processing into compost in GVMC:

1) Tender Notice No : **E.file No.231734/2020/F2/CMOH/PH Dt:12.10.2020**

2) No of Works : **1** 3) **Name of Works:** Maintenance of Bad Odour control & wet Waste **Est.Value Rs.8,93,700/-**

4) Tender Schedule cost : **Rs.1,000/-** 5) Tender Schedule will be issued : From **13-10-2020 to 15-10-2020 upto from 10.30 AM to 5.00 PM**

6) Date of receipt of tender schedule : **16-10-2020 from 10.30 AM to 3.30 PM**

7) Tender opening date and time: above : **16-10-2020 at 5.00 PM**

The interested parties can obtain further information on purchase of Tender Schedule in all working days from the O/o the CMOH Section, GVMC from **10.30 AM to 5.00 PM.** The terms and conditions are detailed in Tender Schedule. The Commissioner, GVMC has right to reject or cancel tender without assigning any reason thereof.

**For Commissioner**

| S. No | Tender Notice No. | No of Works | Value of Works | Down Loading Starting Date & Time | Down Loading Ending Date & Time | Last Date & Time for submission of Bids | Date of opening Tenders | Contact Phone No |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | STREET LIGHTING SECTION 'e' Procurement Short Tender Notice No.12/2020-21/EE(Elec), Dt:12.10.2020 | 1 No | Rs.2.54 Lakhs | 12-10-2020 @ 03.00 PM | 15-10-2020 @ 02.00 PM | 15-10-2020 @ 03.00 PM | 15-10-2020 @ 03.30 PM | 99480 78504 |

Note: Further details at **http://www.apeprocurement.gov.in** Contact No.**99480 78504**

**O/o the EE(Electrical)** **For Commissioner**

# విజయభాను

## సంపాదకీయం

### సాంస్కృతిక విశేషం

ఆయా కాలాల ప్రజల అనుభవాల, భావాల, అభిరుచుల, ఇష్టానిష్టాల, సుఖదుఃఖాల, భౌతిక ఆధ్యాత్మిక విషయాల సంపుటీకర ణమే సాహిత్యం. సాహిత్యంలో అంతర్భాగాలైన పదజాలం, సామెతలు, కవిత్వం ప్రతిదానిలోను ఏదో కొంత సాంస్కృతిక విశేషం లభించవచ్చు. కాలపరిణామంలో, ఆచార సంప్రదాయాల్లో, జీవన సరళిలో ఎన్నోరకాల మార్పు లు చోటుచేసుకోవచ్చు. కొన్ని పూర్తిగా పోవచ్చు. పాక్షికంగా మారవచ్చు. కొత్తవి ప్రారంభం కావచ్చు. వీటికి పరిసర ప్రాంతీయ భాషా సాహిత్య మత వ్యాపార సంబంధాల హేతువు కావచ్చు. దాడులు కావచ్చు. పాలకసంస్కృతి ఆచారాల అనుకరణలు కావచ్చు. సాహిత్యం సంస్కృతీపరిణామాల అవగాహనకు ఆధారభూతంగా ఎలా నిలుస్తుందో వైవిధ్యభరితమైన అంశాలు మచ్చుకు కొన్ని.. ఈ పిల్ల పదహారణాల తెలుగు అమ్మాయి. పిల్ల పదం ఏనాటిది? శాతవాహన కాలంనాటి గాథాసప్తశతిలో తొలిసారి కనిపిస్తుంది. అంతకుముందే జన వ్యవహారంలో నిత్యం వాడుకలో ఉన్న పదం. అంటే ఒక పదం వెనుక వేల ఏళ్ళ చరిత్ర ఉన్నట్లే కదా. మరి పదహారణాల తెలుగు అమ్మాయి అని ఎందుకనాలి? పదిహేడు అనవచ్చు. పద్నాలుగు అనవచ్చు, 20 అణాలు అనవచ్చు కదా! నిజాం కాలంలో ఉన్న ద్రవ్య మారకం ఇది. అణా అంటే ఆరు పైసలు. 16 అణాలు అంటే 96 పైసలు. నిజాంకాలంలో 96 పైసలే రూపా యి కింద లెక్క. బ్రిటిషాంధ్రలో నూరుపైసలకు రూపాయి. బూర్గుల రామకృష్ణారావు హైదరాబాద్ ముఖ్యమంత్రి అయినప్పుడు నిజాం రుపీ ని బ్రిటిష్ రూపాయిని సమానం చేశారు. అయితే జనంలో సెంట్ పర్సెంట్ (నూటికి నూరుశాతం) అనే దగ్గర పదహారణాలు అనే జాతీయమే వాడుకలో ఉంది. మనం 25 పైసలకు చారాణా (24 పైసలు) అనీ, 50 పైసలకు (48) ఆఠాణా, 75 పైసలకు (72) బారాణా అనీ వ్యవహారానికి వాడుతూ సర్దుకున్నాం. ఇది చరిత్రలోని ఒక పరిణామానికి సాక్ష్యం. ఈ రోజు పెళ్ళిలో మాంగల్యధారణ అన్నది ప్రధానాంశం. నిజానికి ముహూర్తం అంటే నిర్దేశిత సమయమేం కాదు. దాదాపు 40 నిమిషాలు ఉంటుంది. పురోహితులు సరిగ్గా మధ్యలో ముహూర్తం పెడతారు. మన సౌకర్యం కోసం కాస్త అటూ ఇటూ అయినా పరవాలేదు. ఆ మూహుర్తంలో కూడా జిలకర బెల్లం పెట్టడమే ముఖ్యం తప్ప మాంగల్యధారణ కాదు. జిలకరబెల్లం, సప్తపది, హోమం ఇవే పెళ్ళికి మూలం. మాంగల్యధారణ తర్వాత కాలంలో వచ్చిన దాక్షిణాత్య ఆచారం. దీని కాలం ఎప్పటిది అని తెలుసుకోవాలంటే సాహిత్యాధారం తోడ్పడుతుంది. తిక్కన.. ఉత్తరాభిమన్యుల వివాహంలో తలంబ్రాలు పోసుకోవడాన్ని వర్ణించాడే తప్ప మాంగల్యధారణ వర్ణించలేదు. పోతన భాగవతంలో..

మ్రింగెడువాడు విభుండని
మ్రింగెడిదియు గరళమనియు మేలని ప్రజకున్
మ్రింగుమనె సర్వమంగళ
మంగళ సూత్రంబు నెంతమది నమ్మినదో (భాగవతం.8-241)

అని స్పష్టంగా మాంగల్యధారణను చెప్పాడు. అంటే తిక్కన నాటికి లేకుండా పోతనకాలం నాటికి మధ్యలో ఈ ఆచారం వచ్చి స్థిరపడిందని ఊహించాలి. లలితా సహస్రనామం అందరూ పారాయణం చేస్తుంటారు. బ్రహ్మాండ పురాణం ఉత్తరభాగంలో లలితాసహస్రనామం ఉంది. అందులో కామేశబద్ధమాంగల్య సూత్రశోభిత కంధరా అని వస్తుంది. శివుడు పార్వతిమెడలో మంగళసూత్రం కట్టాడని భావం. బ్రహ్మాండ పురాణం గుప్తుల కాలంలో రాయబడిందంటారు. మరి అప్పుడు ఈ ఆచారం ఉందా? ఉన్నట్లు ఆధారాలు లేవు. ఎవరో భక్తాగ్రగణ్యుడు లలితాసహస్ర నామాన్ని బ్రహ్మాండపురాణంలో దూర్చడంలో విజయం సాధించాడు. ఇలా మధ్యలో చేర్చిన వాటిని ప్రక్షిప్తాలని పిలుస్తాం.

చేతులారంగ శివుని పూజింపడేని -
నోరునొవ్వంగ హరికీర్తి నుడవడేని
దయయు సత్యంబు లోనుగా దలపడేని
కలుగ నేటికి తల్లుల కడుపు చేటు..

అందరికీ తెలిసిన పోతన పద్యం ఇది. సాధారణంగా అర్థం చెప్పేస్తారు. కాని ఇందులో ఒక సంస్కృతీ విశేషాన్ని పోతన నిక్షిప్తం చేశాడని గమనిస్తే మరింత ఆనందం కలుగుతుంది. అభిషేకప్రియుడు శివుడు, కనుక శివాలయానికి వెళ్ళి శివుని నెత్తి మీద నీళ్లు పోయాలి. ఎందుకు గరళతాపహరణార్థం. అది చేతులారంగ చేయాల్సిందే. విష్ణువు సంకీర్తన ప్రియుడు. అందుకే విష్ణువుకు సుప్రభాతాలు, సహస్రనామాదులు ఉంటాయి. అవన్నీ నోరు నొవ్వంగ చేయాల్సిందే. చేతులారంగ శివుని పూజింపడేని.. నోరు నొవ్వంగ హరికీర్తి నుడువడేని.. అంటే అభిషేకప్రియుడు శివుడు. సంకీర్తన ప్రియుడు విష్ణువు. నమస్కారప్రియుడు సూర్యుడు. స్మరణప్రియుడు దత్తాత్రేయుడు. ఆయాదేవతల అభీష్టాల ప్రకారం పూజిస్తేనే మన అభీష్టాలు నెరవేరుతాయి.

## రాజమండ్రి సీఆర్పీఎఫ్ కు తమ సంపూర్ణ మద్దతు



రాజమండ్రి : ఇటీవల రాజమండ్రి నగర చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం(సీఆర్పీఎఫ్) నూతన కార్యవర్గం లో నియమించబడ్డ ప్రతినిధులు మంగళవారం రాజమండ్రి పార్లమెంట్ సభ్యుడు మార్గాని భరత్ రామ్,రాజానగరం శాసన సభ్యులు జక్కంపూడి రాజాలను నగరం లోని క్యాంప్ కార్యాలయాల్లో చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గొండు సీతారాం నేతృత్వంలో రాజమండ్రి ఫోరం అధ్యక్షుడు బి.రమేష్,,ఉపాధ్యక్షులు సి.హెచ్,విజయలక్ష్మి, కె.వి.వి.రమణ.లు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు,

ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు మర్గాని భారత్ రామ్,రాజానగరం శాసన సభ్యులు జక్కంపూడి రాజాలు మాట్లాడుతూ సీఆర్పీఎఫ్ దేశంలోనే పేరు ప్రఖ్యాతలు గల బాలల హక్కుల సంస్థ రాజమండ్రి లో తన కార్యకలాపాలను ప్రారంభించడం హర్షణీయమన్నారు, బాలల హక్కుల సాధన కోసం,సంక్షేమం కోసం నిర్విరామ కృషి చేస్తూ బాలల తల్లిదండ్రుల్లో నైతిక స్థైర్యం,ధైర్యం నింపేలా కృషి చేయాలని కోరారు, తమ వంతు సహాయ సహకారం ఎల్లపుడూ అందిస్తామని భరోసా ఇచ్చారు.

చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం (సీఆర్పీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు,డాక్టర్ గొండు సీతారాం,రాజమండ్రి నగర అధ్యక్షుడు బి.రమేష్ మాట్లాడుతూ తమ ఫోరం ఆధ్వర్యాన వివిధ బాలల హక్కులు,సంక్షేమ కార్యక్రమాల సాధన కోసం ప్రజా ప్రతినిధులు,జిల్లా ఉన్నతాధికారులు సంపూర్ణ మద్దతు అందించాలని కోరారు.

ప్రజా ప్రతినిధులను కలిసిన వారిలో ఫోరం ప్రధాన కార్యదర్శి జి.శ్యామల, కార్యదర్శి పి. లలితాంబ,సహాయ కార్యదర్శి బి. తవిటయ్య,మహిళా కన్వీనర్ ఎం.అరుణ జ్యోతి,సభ్యుడు ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చెరువు గట్టు ను పరిశీలించిన జెడ్సీ శ్రీధర్‌బాబు




కంచరపాలెం : ఇటివలే కురుస్తున్న వర్షాల నేపథ్యంలో శీలనగర్ దరి జీవీఎంసీ 88 వ వార్డు పరిది లో వున్న రేవల్ చెరువును జివిఎంసి జోన్ -5 కమిషనర్ శ్రీదర్ బాబు మంగళవారం సందర్శించారు.

ఈమేరకు చెరువు ప్రమాద కర రీతిలో ప్రవహిస్తుందని చెరువు గట్టు తేగితే స్థానికంగా ఉన్న తులసి గార్డెన్స్ అపార్ట్ మెంట్ చుట్టుప్రక్కల గ్రామల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతారని గ్రామ మాజీ సర్పంచ్ ఒమ్మి కుంచి బాబు జేడ్సి దృష్టికి తీసుకుని వెళ్ళారు. వస్తవ పరిస్థితులను పరిశీలించి సమస్య పరిష్కర దిశగా చర్యలు చేపడతామని జేడ్సి శ్రీదర్ బాబు తెలియజేశారు. కార్యక్రమంలో వైసీపీ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి గంరెడ్డి మహలక్ష్మి నాయుడు , తదితరులు పాల్గున్నారు .

## ఏపీలో 67లక్షలు దాటిన కరోనా పరీక్షలు




అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో గడిచిన 24 గంటల్లో 72,082 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా.. కొత్తగా 4,622 మందికి పాజిటివ్‌గా తేలింది. దీంతో రాష్ట్రంలో మొత్తం కరోనా కేసుల సంఖ్య 7,63,573కు చేరింది. గత 24 గంటల్లో కొత్తగా 5,715 మంది ఆస్పత్రుల నుంచి డిశ్చార్జ్ కాగా.. మొత్తం కోలుకున్నవారి సంఖ్య 714427గా ఉంది. తాజాగా కరోనాతో 35 మంది మృతి చెందగా.. మొత్తం మరణాలు 6,291కు చేరాయి. రాష్ట్రంలో యాక్టివ్ కేసులు సంఖ్య 42,855గా ఉంది. రాష్ట్రంలో ఇప్పటి వరకు మొత్తం 67,02,810 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు.

## సమకవియం

### దుష్టులకు దూరంగా వుండవలెను

దుష్టులతో స్నేహం చేస్తే మనకూ అదే విధమైన పేరు వస్తుంది. మీరు మంచివారయినా మీ సావాసగాళ్ళు చెడ్డవారైతే మిమ్మల్ని కూడా చెడ్డవారిగానే ఈ లోకం పరిగణిస్తుంది. తాడిచెట్టు క్రింద కూర్చుని పాలు త్రాగినా కల్లు తాగుతున్నాడనే అంటారు. అంటే దుష్టుల ఛాయకు అంత చెడ్డపేరు వుందన్నమాట. చెడ్డవారితో స్నేహం మొదలు బాగానే వుంటుంది. కానీ చివరకు వ్యసనాలను, అనేకమైన ఇతర దుర్గణాలనూ నేర్పిస్తుంది. కాబట్టి చెడ్డవారికి దూరంగా వుండటం మంచిది. ఈ విషయాన్ని ఓ వేమన పద్యం ద్వారా విందాం.

'కానివానితోడు గలసి మెలుగుచున్న
గానివానివలెనె కాంతురవని
తాడిక్రిందుబాలు త్రాగిన చందమౌ
విశ్వదాభిరామ వినురవేమ'

... రచయిత
వడ్లమాని అన్నపూర్ణ

## పంచాంగం

మాసం : అధిక ఆశ్వయుజ; తిథి : ద్వాదశి ఉ.8.21; పుబ్బ సా.6.51; రా.వ.1.39ల 3.09.

**బుధవారం 14-10-2020**

**మేషం :** ఏ విషయంలోను ఒంటెద్దు పోగడ మంచిది కాదు. మీ శ్రీమతి మొండి వైఖరి మీకు చికాకు కలిగిస్తుంది. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల వారికి ఆశాజనకం. బేకరి, పండ్ల, స్వీట్ వ్యాపారాలు జోరుగా సాగుతాయి. గృహోపకరణాలు, వాహనం అమర్చుకుంటారు.ఇచ్చిపుచ్చుకునే వ్యవహారాలు, ఒప్పందాల్లో మెలకువ వహించండి.

**వృషభం :** ఒక కార్యం నిమిత్తం ఆకస్మికంగా ప్రయాణం చేస్తారు. చీటికి, మాటికి ఎదుటివారిపై అసహనం ప్రదర్శిస్తారు. హోటల్, క్యాటిరింగ్ పనివారలకు సదవ కాశాలు లభిస్తాయి. ఒక వేడుకను ఘనంగా నిర్వహించటానికి యత్నాలు మొదలెడతారు. కొంత మంది మీ పలుకుబడి ద్వారా లబ్ధి పొందుతారు.

**మిధునం :** ఓర్పు, నేర్పుతో అనుకున్నది సాధిస్తారు. నూతన ప్రదేశాలు సందర్శనలు అనూకిలిస్తాయి. వృత్తుల వారు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవటం మంచిది. కోర్టు వ్యవహారాలు, భూ వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. ఉద్యోగస్తులకు రావలసిన క్లయింలు, అలవెన్సులు ఆలస్యంగా అందుతాయి.

**కర్కాటకం:** బంధువుల రాకతో గృహంలో సందడి నెలకొంటుంది. ప్రేమ వ్యవహారాల్లో ఇబ్బందులను ఎదుర్కొంటారు. గతంలో పోల్చుకుంటే ప్రస్తుత ఆర్థికస్థితి కొంత మెరుగనిపిస్తుంది. వైద్య రంగాల వారికి గుర్తింపు, కీర్తి ప్రతిష్టలు లభిస్తాయి. ఆడిట్, అకౌంట్స్ రంగాల వారికి పని ఒత్తిడి, చికాకులు తప్పవు.

**సింహం:** స్త్రీలకు అలంకారాలు, విలాస వస్తువుల మీద మక్కువ పెరుగుతుంది. సంఘంలో మీ కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయి. దీర్ఘకాలిక సమస్యల శాశ్వత పరిష్కా రానికి బాగా శ్రమిస్తారు. అకాల భోజనం, శారీరక శ్రమ వంటి ఇబ్బందు లెదుర్కొం టారు. ఇసుక, క్వారీ కాంట్రాక్టర్లకు ప్రభుత్వాధికారుల నుంచి వేధింపుల తప్పవు.

**కన్య:** రాజకీయ నాయకులు సభ, సమావేశాల్లో పాల్గొంటారు. మనోధైర్యంతో యత్నాలు సాగించాల్సి ఉంటుంది. ఏజెంట్లు, బ్రోకర్లు, వృత్తుల వారికి సదవకాశాలు లభిస్తాయి. బంధుమిత్రుల నుంచి ఒత్తిడి, మొహమ్మాటాలు ఎదుర్కొంటారు. ప్రముఖ ఆలయాల్లో దైవదర్శనాలు అతికష్టం మీద అనుకూలిస్తాయి.

**తుల:** ఒక స్థిరాస్తి విక్రయించాలనే ఆలోచన స్ఫురిస్తుంది. ధనవ్యయం అధికంగా ఉంటుంది. మార్కెట్ రంగాల వారు టార్కెట్లను సునాయాసంగా పూర్తి చేస్తారు. క్యాటరింగ్ పనివారలకు సదవకాశాలు లభిస్తాయి. మీ భావాలు, ఆలోచనలకు మంచి స్ఫూర్తి లభిస్తుంది. కోర్టు వ్యవహారాలలో ప్లీడర్లకు చికాకులు అధికమవు తాయి. నిరుద్యోగులకు రాత, మౌఖిక పరీక్షల్లో ఏకాగ్రత ముఖ్యం. కుటుంబ విషయాల్లో స్త్రీలకు పట్టుదల, పంతాలు మంచిది కాదు.

**వృశ్చికం:** ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఒత్తిడి అధికం. ఆర్థిక లావాదేవీలు, కుటుంబ విషయాల పట్ల శ్రద్ధ వహిస్తారు. ప్రింటింగ్ రంగాల వారికి మందకొడిగా ఉంటుంది. మీ జీవిత భాగస్వామి సలహా మీకెంతగానో నచ్చుతుంది. పత్రిక, వార్తా సంస్థలలోని వారి ఏమరుపాటుతనం వల్ల స్వల్ప ఇబ్బందులు తప్పవు.

**ధనుస్సు:** ఎంత శ్రమించినా ఆదాయం అంతంత మాత్రంగానే ఉంటుంది. స్త్రీలకు షాపింగ్‌లోను, పనివారల విషయంలో తగు జాగ్రత్తలు అవసరం. నిరుద్యోగులు వచ్చిన తాత్కాలిక అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవటం శ్రేయస్కరం. వ్యాపా రాల్లో కొత్త కొత్త పథకాలతో కొనుగోలుదార్లను ఆకట్టుకుంటారు.

**మకరం:** ఆడిట్, అకౌంట్స్ రంగాల వారికి పని ఒత్తిడి, చికాకులు తప్పవు. బంధు వులతో చిన్న చిన్న కలహాలు జరిగే ఆస్కారం ఉంది. రవాణా రంగాలలో వారికి మిశ్రమ ఫలితం కానవస్తుంది. ప్రముఖుల పరిచయాలు, పాత మిత్రుల కలయిక మీ ఉన్నతికి దోహదపడతాయి. ఆదాయానికి సరిపడని ఖర్చు కానవస్తుంది.

**కుంభం:** దూర ప్రయాణాలలో వస్తువుల పట్ల మెళుకువ అవసరం. హామీలు, చెక్కుల జారీల్లో ఏకాగ్రత వహించండి. ఇంజనీరింగ్, మెడికల్, కంప్యూటర్, శాస్త్ర రంగాల వారికి పురోభివృద్ధి. ముఖ్యమైన పర్యటనలలో అవాంతారాలు ఎదురైనా జయం పొందుతారు. సమయాన్ని వృధా చేసే కొలది నష్టాలను ఎదుర్కొంటారు.

**మీనం:** వ్యాపారాల్లో నష్టాలు, ఆటంకాలు క్రమేణా అధికమిస్తారు. స్త్రీలపై సన్నిహితులు, చుట్టుపక్కల వారి ప్రభావం అధికంగా ఉంటుంది. వాహనం నిదానంగా నడపటం క్షేమదాయకం.

## షిర్డీ 'సాయిబాబా' జీవిత చరిత్ర



**( గత తరువాయి)**

పట్టి ఓడిపోయిన తరువాత బాబాలో చాలా మార్పు వచ్చింది. సూఫీ ఫకీరులలాగా మోకాళ్ళ వరకు ఉండే 'కఫనీ', తలకు టోపీలాగా చుట్టిన గుడ్డ ధరించడం మొదలుపెట్టారు. ఇలా ముస్లిం ఫకీరులా ఉండే బాబాకు స్థానిక హిందువులనుండి కొద్దిపాటి ప్రతిఘటన కూడా ఎదురయ్యింది.

1918లో తన మరణం వరకు సాయిబాబా షిరిడీలోనే ఉన్నారు. ఒక పాత మసీదును తన నివాసం చేసుకొన్నారు. యాచన అతని వృత్తి. మసీదులో ధునిని వెలిగించారు. అందులోనుండి విభూతిని తీసి తన దర్శనానికి వచ్చేవారికి పంచేవారు. అది తమకు రక్షణ ఇస్తుందని భక్తులు నమ్మేవారు. వచ్చిన వారికి ఉపదేశాలు, ధర్మ బోధలు చేసేవారు. చాలా మహత్తులు చూపించే వారని భక్తులు చెబుతారు. స్వయంగా వండి ప్రసాదాన్ని పంచేవారు. ఉత్సవాలలో పాల్గొనేవారు. ఒకోమారు విపరీతంగా కోపం చూపేవారు.

1910 తరువాత సాయిబాబా పేరు దేశమంతటా తెలిసింది. గొప్ప మహత్తులు చూపే సాదువనీ, లేదా అవతారమని విశ్వసించే భక్తులు పెక్కురు బాబా దర్శనానికి రాసాగారు.16 అక్టోబరు 15, 1918 మధ్యాహ్నం 2.30కి బాబా తన భక్తుని వడిలో మహా సమాధి చెందారు. ఆయన దేహం బూటెవాడలో ఖననం చేయబడింది. అక్కడే 'సమాధి మందిరం' నిర్మించబడింది.

**ముఖ్యమైన శిష్యులు**

సాయిబాబా తన మార్గానికి, ఉపదేశాలకు చెందిన సంస్థాగత ఏర్పాట్లు ఏవీ చెయ్యలేదు. ప్రత్యేకించి తన శిష్యులు అని చెప్పుకొనే వ్యవస్థ కూడా ఏమీ లేదు. ఆయన అందరికీ చెందినవారు. సకోరీకి చెందిన ఉపాసనీ మహారాజ్, అహమ్మద్ నగర్‌కు చెందిన మెహర్ బాబా వంటి సాయిబాబా భక్తులు ప్రసిద్ధులయ్యారు.

శ్రీ సాయిబాబా జీవిత సమయంలో కొందరు భక్తులు ఆయనను సదా అంటిపెట్టుకొని ఉన్నారు **వారిలో ముఖ్యులు:** మహాల్సాపతి, హేమాండ్ పంతు, శ్యామా ,తాత్యా.

**బోధనలు**

మసీదు గొడకానుకొని ఉన్న సాయిబాబా, భక్తులతోడుగా తన దైనిక వ్యవహారాలలోను, బోధనలలోను సాయిబాబా హిందూమతానికి చెందిన సంప్రదాయాలనూ, ఇస్లాం సంప్రదాయాలనూ కూడా పాటించారు. నమాజ్ చదవడం, అల్-ఫతీహా మననం, ఖొరాన్ అధ్యయనం వంటి ఆచారాలను ప్రోత్సహించారు కాని చాలా ఇతర ఆచారాలను పాటించలేదు. ఆయన దుస్తులు కూడా సూఫీ ఫకీర్ తరహాలోనే ఉండేవి. మతం, కులం వంటి భేదాలపై ఆధారపడిన విద్వేషాలను పూర్తిగా వ్యతిరేకించారు. అలాగే సనాతన ఛాందస సంప్రదాయాలను, ఏ మతానివైనా గాని, ఖండించారు. తాను ఫకీరుగా ఉన్నా తన అనుయాయులను సామాన్య గృహస్థ జీవనం గడపమని చెప్పారు. ప్రార్థన, భగవన్నామస్మరణ, పుణ్యగ్రంథ పఠనం-వీటిని ప్రోత్సహించారు. ఖొరాన్ చదువమని ముస్లిములకూ, రామాయణం, భగవద్గీత, విష్ణు సహస్రనామ స్తోత్రం వంటివి పారాయణం చేయమని హిందువులకూ ఉపదేశించారు. నీతి బద్ధమైన జీవనం గడపమనీ, ఇతరులను ప్రేమించి సహాయం చేయమనీ చెప్పారు. తన భక్తులకు రెండు ముఖ్యమైన లక్షణాలు అలవరచుకోమని పదేపదే చెప్పారు - అవి శ్రద్ధ (విశ్వాసం, భక్తి, దీక్ష), సబూరి (ఓర్పు, సాధన). నాస్తికత్వాన్ని తప్పు పట్టారు. అశ్రద్ధ చేయకుండా బాధ్యతలు నెరవేర్చాలనీ, వ్యామోహానికి లొంగకుండా తృప్తులు కావాలనీ ఉపదేశించారు. రెండు మతాల గ్రంథాలనూ సాయిబాబా ఆదరించి వ్యాఖ్యానించారు. వాటిపై ఆయనకు లోతైన పరిజ్ఞానం ఉందని ఆయనతో ఉన్నవారు చెప్పారు. హిందూ మత విషయాలపై బాబా వ్యాఖ్యానాలలో అద్వైతం, భక్తి అంశాలు కలగలిసి ఉండేవి. తన నివాస స్థానమైన మసీదుకు ద్వారకామాయి అని పేరు పెట్టుకున్నారు. భగవంతుడు అంతటా, అందరిలోనూ ఉన్నాడ నేది బాబా బోధనలలో ఒక ముఖ్యాంశం. సాయిబాబా ఉపదేశాలు ఇస్లామిక్ సిద్ధాంతాలకూ, ఉపనిషత్సూత్రాలకూ కూడా సరిపోతాయి. ఈ లోకం నశ్వరమనీ, భగవంతుడిచ్చే మోక్షమే శాశ్వతమనీ చెప్పారు. సాధనలో గురువు ప్రాముఖ్య తను గురించీ, గురువునే దేవుడిగా భావించమనీ పదేపదే చెప్పారు. పూర్వపు కర్మల కారణంగా వివిధ ఫలితాలు సంభవిస్తాయని కూడా చెప్పారు. సాయిబాబా రచించిన గ్రంథాలేవీ లేవు. సాయిబాబా బోధనలు మౌఖికంగానే శిష్యులకు లభించాయి. అవి పెద్ద పెద్ద ఉపన్యాసాలు కావు. సమయానుసారంగా చేసిన చిన్న చిన్న ఉపదేశాలు. తన వద్దకు దర్శనానికి వచ్చిన వారిని తరచు సాయిబాబా దక్షిణ అడుగుతుండేవాడు. అలా వచ్చిన ధనాన్ని పేదలకు పంచిపెట్టేవారు. మిగిలిన కొద్దిపాటి ధనంతో పుగాకు,

## సంకీర్తన

### తుఫాన్ కారణంగా దెబ్బతిన్న ఉద్యాన పంటలలో

# జాగ్రత్తలు తీసుకోవాలి

### ఉద్యాన అధికారిణి జి.రాధిక



పరవాడ : అల్ప పీడనం కారణంగా కురిసిన భారీ వర్షం మరియు ఈదురు గాలులు కారణంగా దెబ్బతిన్న ఉద్యాన పంటలలో ఈ క్రింద తెలిపిన పలు జాగ్రత్తలు తీసుకోవాలినీ విశాఖపట్నం మరియు బిమిలి డివిజన్‌లు అధికారిని జి.రాధిక తెలిపారు. మంగళవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కూర గాయలు మడుల్లో నిలిచిన నీరు పూర్తిగా బయటికి పోయేలా కలవులు చేసుకోవాలని అన్నారు. పాక్షికంగా లేదా పూర్తిగా దెబ్బతిన్న బొప్పాయి మరియు అరటి చెట్లను కుళ్ళిన భాగాలను పొలమునుంచి తీసి వేసి దూరంగా తగలబెట్టాలని అన్నారు. ఒరిగిన చేట్లను నిలబెట్టి కర్రల సహాయంతో ఏర్పాటు చేయాలని అన్నారు. ఎడతెరిపులేని వర్షం వలన మొదల్లో నీరు నిలిచిపోయి తెగులు ఆశించడం జరుగుతుంది. దీన్ని నివారించడానికి సి ఓ సి కాపర్ అక్సిక్లోరిడే మందును మూడు గ్రాముల లీటరు నీటికి చొప్పున కలిపి మందు ద్రావణాన్ని తయారు చేసుకొని మొక్కల మొదళ్లలో పిచికారి చేయాలని అన్నారు. రైతులందరూ ఈ జాగ్రత్తలు పాటించి నష్ట తీవ్రతను తగ్గించు కోవాలని ఈ సందర్భంగా రైతుల అందరిని రాధిక కోరారు.

### బొడ్డు చెట్టు కోలనీ ఆనుకొని ఉన్న గెడ్డకు

## గోడ నిర్మించాలని అధికారులకు విజ్ఞప్తి : గిరిజన సంఘం నాయకులు దీసరి గంగరాజు



అనంతగిరి : అనంతగిరి పంచాయతీ, అనంతగిరి బొడ్డచెట్టు కోలనీ గ్రామానికి ఆనుకొని ప్రవహిస్తున్న అనంతగిరి గెడ్డ ఉధృతంగా గ్రామం వైపు ప్రవహిస్తోంది. ఇది వరకు కురిసిన భారీ వర్షాలకు రక్షణ గోడ కూలి కొట్టుకు పోయింది. ఇప్పుడు కురుస్తున్న భారీ వర్షాలకు గ్రామం వైపు ఉద్రుతంగా ప్రవహించడం వలన గెడ్డ కు ఆనుకుని ఇండ్లులోనివసిస్తున్న కుటుంబాలు భయ భ్రాంతులకు గురవుతున్నారు. ఈ విషయంపై గిరిజన సంఘం ఆధ్వర్యంలో అనంతగిరి తహసీల్దార్ వెంకట వరప్రసాద్ కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా అనంతగిరి మాజీ ఎంపీటీసీ సభ్యులు దీసరి గంగరాజు, మాట్లాడుతూ గ్రామానికి తక్షణమే నిధులు మంజూరు చేసి రక్షణ గోడ నిర్మించాలని గెడ్డకు అవతల ఉన్న చెట్లను తుప్ప లను ఇసుక మట్టి తో ఉన్న మేట్లను తొలగించాలని తహసీల్దార్ గారికి మండల అభివృద్ధి అధికారి గారికి వినతిపత్రాలు ఇవ్వడం జరిగిందని ఈ కార్యక్రమంలో గ్రామస్తులు నందుల. చిన్నయ్య. బి. బుద్ధు. బి.రమేశ్. ఎన్.మోస్య. డి.లక్ష్మణరావు. ఎన్. స్వామి. కె.సోమన్న బి.నిర్మల గ్రామస్తులు పాల్గొన్నారని గిరిజన సంఘం నాయకులు దీసరి గంగరాజు తెలిపారు.

### కాన్సిట్యూషన్ ఆఫ్ పార్లమెంటరీ ఫ్రెండ్ షిప్ గ్రూపులో

## అరకు ఎంపీ మాధవికి స్థానం



కొయ్యూరు : కాన్సిట్యూషన్ ఆఫ్ పార్లమెంటరీ ఫ్రెండ్ షిప్ గ్రూపులో అరకు ఎంపి గొడ్డేటి మాధవికి స్థానం లభించింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి లోక్‌సభ సెక్రటరియేట్ ఎంపిని నామినేట్ చేశారు. ఇటలీకి ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ మేరకు లోక్‌సభ సెక్రెటరియేట్ ఈ విషయాన్ని అరకు ఎంపి కార్యాలయానికి పంపింది. దీని ప్రకారం పార్టీ తరుపున ఇటలీ దేశానికి మాధవి నామినేట్ చేయబడ్డారు. భవిష్యత్తులో ఆ దేశంతో జరిగే పలు వ్యవహారిక అంశాలపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున మాధవి హాజరయ్యే అవకాశం ఉంటుంది. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ ఈ అవకాశాన్ని ఇచ్చిన ముఖ్యమంత్రి వైయస్.జగన్‌మోహన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి, మిథున్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## కరోనా వైరస్ పట్ల

## ప్రతీ ఒక్కరూ జాగ్రత్తలు పాటించాల్సిందే... 'కోవిడ్ ప్రతిజ్ఞ'

### జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఐపిఎస్



విశాఖసిటీ : జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఇపి.ఎస్., రాష్ట్ర డీజీపీ గౌతమ్ సవాంగ్ ఆదేశాలు మేరకు పోలీసు కార్యాలయ సిబ్బంది మరియు పోలీసు అధికారులు, సిబ్బందితో కరోనా వైరస్ మహమ్మారి నుంచి అప్రమత్తంగా ఉంటూ, స్వీయ రక్షణ చర్యలు తీసుకుంటూ, మన సహచరులుకు, కుటుంబ సభ్యులకు కరోనా వైరస్ ప్రబలించే విధంగా ప్రవర్తించమని 'కోవిడ్ ప్రతిజ్ఞ' చేయించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ కరోనా వైరస్ నుంచి అప్రమత్తంగా ఉంటూ మరియు అనుక్షణం ఎప్పటికప్పుడు మన మనస్సులో ఈ ప్రతిజ్ఞ స్మరించుకుంటూ, మనల్ని మనమే రక్షించుకుంటూ సమాజ రక్షణ లో వ్యక్తిగతంగా బాధ్యత వహించాలని అన్నారు. కోవిడ్-19 వ్యాధి మీ నుంచి మీ సహచరులకు వ్యాపించే ప్రమాదం ఉన్నందన ఈ వైరస్ వ్యాప్తిని నివారించడానికి అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కోవిడ్-19 నియమ నిబంధనలు, ప్రవర్తనలను అనుసరిస్తూ, ఇతరులు అనుసరించే విధంగా చర్యలు తీసు కోవాలని కోరారు. ఎల్లప్పుడూ బహిరంగ ప్రదేశాల్లో ఉన్నప్పుడు ఫేస్ మాస్క్ ఫేస్ షీల్డ్ తప్పకుండా ధరించాలని, ఇతరుల నుండి కనీసం 6 అడుగుల దూరం పాటిస్తూ, తరచుగా చేతులు సబ్బుతో కడుకోవాలని సూచించారు. కోవిడ్-19 కి వ్యతిరేకంగా మనము అందరము కలిసికట్టుగా పోరాటం చేస్తూ ఆ పోరాటంలో కలిసి విజయం సాధించాలని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కోరారు. ఈ ప్రతిజ్ఞ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రారాజ ప్రసాద్., అదనపు ఎస్పి., క్రైమ్, సి.హెచ్. ప్రసాద్ ఇన్స్పెక్టర్ డి.సి.ఆర్.బి., - శ్రీకాంత్ యాదవ్, ఇన్స్పెక్టర్ కమ్యూనికేషన్ - కుమార స్వామి ఎస్.ఐ. ఐ.టి, కోర్ మరియు కార్యాలయ సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### 18 నుండి సత్యదేవుని సన్నిధిలో

## వివాహములకు అనుమతి



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి, దేవస్థానం లో దేవాదాయ శాఖ కమీషనర్ వారి సూచనలు ప్రకారము కోవిడ్ నిబంధనలు పాటిస్తూ ది.18.10.2020వ తేది ఆదివారం నుండి భక్తులు శ్రీ స్వామివారి దేవస్థానం పై వివాహములు జరిపించుటకు అనుమతించబడిను.కావున సత్యదేవుని సన్నిధిలో వివాహము చేసుకునే భక్తులు కోవిడ్ నిబంధనలు పాటిస్తూ వివాహములు చేసుకోవచ్చని దేవస్థానం కార్యనిర్వహణాధికారి వి.త్రినాధరావు కోరారు.

### అన్ని పంటలను జాయింట్-అజమాయిషీ-

## ఇక్రాప్ యాప్ ద్వారా నమోదు



భీమునిపట్నం: భీమునిపట్నం మండలం లోని ఖరీఫ్ 2020 సం॥లో అన్ని గ్రామాలలో రైతులు సాగుచేస్తున్నటు వంటి అన్ని పంటలను జాయింట్-అజమాయిషీ-ఇక్రాప్ యాప్ ద్వారా నమోదు చేయడం జరిగిందనీ భీమిలి మండల వ్యవసాయాధికారి సి.హెచ్ సంధ్య రత్నప్రభ తెలిపారు. ఈ పంటలను నమోదు చేయడం వలన ఈ ఖరీఫ్ సీజన్ కు గాను పంటల భీమా పథకం మరియు వరి కొనుగోలుకు అర్హత ఉంటుందని చెప్పారు.నమోదు చేసిన రైతుల పంటల వివరాలను రైతు భరోసా కేంద్రంలో ఉంచడం జరిగిందనీ తెలిపారు. ఈ వివరాలను రైతులు చూసి ఏమైనా అభ్యంతరాలు ఉంటే గ్రామ వ్యవసాయాధికారిని సంప్రదించాలని కోరారు. అంతేకాకుండా సొంత భూమి లేని కౌలు రైతులు 5గురు ఒక గ్రూప్ గా ఏర్పడి బ్యాంక్ నుంచి ఋణం పొందడానికి రైతు భరోసా కేంద్రాలను సంప్రదించాలని ఆమె కోరారు.

## డాక్టర్ శ్రీరామచంద్రమూర్తి అకాల మృతికి ప్రత్యేక శ్రద్ధాంజలి

**- డాక్టర్ శ్రీరామచంద్రమూర్తికి బేసిక్ మెడికల్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ తరపున ప్రత్యేక శ్రద్ధాంజలి**

**- ఆయన అకాల మృతి గ్రామీణ వైద్యులకు తీరని లోటు - పదిలం బెన్నబాబు**



అన్నవరం : విశాఖపట్నం జిల్లా వడ్డాది గ్రామంలో గత కొన్ని సంవత్సరములుగా ఎంతో మందికి పేదలకు, మధ్య తరగతి వారికి అనేక రకములైన ఆయుర్వేద వైద్య సేవలు అందిస్తున్న సీనియర్ ఆయుర్వేద వైద్యులు,ఇంకాప్స్ డైరెక్టర్, విశ్వ ఆయుర్వేద పరిషత్ ఉపాధ్యక్షులు, పలు ఆయుర్వేద సంఘాలకు గౌరవ సలహాదారు ఉత్తమ వైద్యులు అందరికీ ఆదర్శప్రాయులైన డాక్టర్. సుంకరణం. శ్రీరామచంద్రమూర్తి(గోవాడ డాక్టర్) ఆకస్మికంగా మృతి చెందారనే వార్త మా గ్రామీణ వైద్యుల హృదయాలను కలచివేసిందని,ఆయన మా మధ్య ఇక లేరన్న వార్త మమల్ని శోక సముద్రంలో ముంచేసిందని,ఎంతో మంది గ్రామీణ వైద్యులను తయారు చేసిన ఘనత డాక్టర్.శ్రీరామచంద్రమూర్తి గారిదని, అదేవిధంగా ఆయన వద్ద శిష్యరికం చేయడం తన పూర్వ జన్మ శుక్రుతం అని బేసిక్ మెడికల్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ స్టేట్ వెస్ ప్రెసిడెంట్ పదిలం.బెన్నబాబు అన్నారు.ఆయన అకాల మృతికి ప్రత్యేక సంతాపం తెలియజేస్తూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ బేసిక్ మెడికల్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ స్టేట్ ప్రెసిడెంట్ వి.వి.కృష్ణారావు,వైస్ ప్రెసిడెంట్ పదిలం బెన్నబాబు,సెక్రటరీ శిరికి.శ్రీనివాస్, కోశాధికారి ఎ.వి. వి.యస్.శ్రీనివాస్ కుమార్,రాష్ట్ర సీనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ నీలాతి.ప్రసాద్,రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ షేక్.ఆషిక్, తూ.గో.జిల్లా ప్రెసిడెంట్ అద్దంకి.సూర్య,సెక్రటరీ యస్.మురళీధర్, విశాఖపట్నం జిల్లా గౌ.అధ్యక్షుడు బెన్నాబత్తుల. శ్రీరామ చంద్రమూర్తి, దండి నూకరాజు, రమణ, బావిశెట్టి దొర తదితరులు ప్రత్యేక సంతాపాన్ని తెలియజేశారు.

## వెదుళ్లగెడ్డలో

# కొట్టుకుపోయిన కారు

### - ఒకరు మృతి



మృతి చెందిన మహిళ

నాతవరం : నాతవరం మండలంలో గల గన్నవరంమెట్ట గ్రామంలో తుని నర్సీపట్నం రోడ్డులో ఉప్పొంగి ప్రవహిస్తున్న వెదుళ్లగెడ్డలో కారు కొట్టుకుపోగా నలుగురు గల్లంతయ్యారు. ఇందులో ముగ్గురిని స్థానికులు రక్షించగా ఒక మహిళ మృతి చెందింది. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. నర్సీపట్నం మండలం నర్సీపట్నంకి చెందిన గుండుభోగుల ఉమా మహేశ్వరి(60), గుండుభోగుల దీపక్, గుండు భోగుల అర్చన, ఆర్.వెంకటేష్ (డ్రైవర్) మంగళవారం ఉదయం నర్సీపట్నం నుంచి తిరుపతి దైవ దర్శనానికి బయలు దేరారు. అయితే రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గన్నవరం మెట్ట వద్ద గల వెదుల్ల గెడ్డ రోడ్డుపై ప్రవహిస్తుండగా ఆ నీటిలో నుంచి కారుపోనిస్తుండగా నీరు ఉద్రిక్తతకు కారు గెడ్డలో కొట్టుకుపోయింది. గెడ్డలో కొట్టుకుపోతూ ఆర్తనాదాలు చేస్తున్న ముగ్గురిని స్థానికులు రక్షించగా ఒకరు మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న నర్సీపట్నం సబ్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్రేన్ సహాయంతో గెడ్డలో ఉన్న కారును బయటకు తీసి కారులో ఉన్న మృతదేహాన్ని బయటకు తీసి బంధువులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం రూరల్ సిఐ అప్పలనాయుడు, మండల తహశీల్దార్ జానకమ్మ, ఎస్సై జె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.



కారును బయటకు తీస్తున్న దృశ్యం

## అధికారులు

## అప్రమత్తంగా ఉండాలి



తాండవ జలాశయాన్ని సందర్శించిన సబ్ కలెక్టర్

నాతవరం : తాండవలో వరద ఉదృతి పెరుగుతున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని నర్సీపట్నం సబ్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య ఆదేశించారు. మంగళవారం ఉదయం తాండవ జలాశయాన్ని ఆమె సందర్శించారు.

నీటి ఉదృతి, బయటకు విడుదల చేస్తున్న నీటి వివరాలను డిఇ రాజేంద్రకుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జానకమ్మ పాల్గొన్నారు.

## కొండవాలు ప్రాంత ప్రజలకు అప్రమత్తంగా ఉండాలి

### బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి రెయ్యి రత్నం



పరామర్శిస్తున్న దశ్యం

గాజువాక : కొండవాలు,లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బీజేపీ,జనసేన ఉమ్మడి అభ్యర్థి రెయ్యి రత్నం ప్రజలకు హెచ్చరించారు. వార్డులోని రెండు రోజులుగా కురిసిన భారీ వర్షం కారణంగా సత్తెమ్మతల్లి గుడి దగ్గర, భానోజీ కాలనీలో కొండపైన ఇళ్ళల్లోకి కొండ చరియలు విరిగిపడి ప్రమాదాలు చోటుచేసుకున్న విషయం తెలుసుకున్న జనసేన - బీజేపీ ఉమ్మడి కార్పొరేటర్ అభ్యర్థి రెయ్యి రత్నం మంగళవారం సంఘటనా స్థలానికి చేరుకుని అక్కడ ఉన్న ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జీవీఎంసీ కమీషనర్ కు వినతిపత్రం ద్వారా జరిగిన ఘటనకు తగిన నష్టపరిహారాన్ని వచ్చే దిశగా మాట్లాడుతానని హమీ ఇచ్చారు. రెయ్యి రత్న మాట్లాడుతూ ఈ కొండపైన ఇళ్ళల్లో నివాసముంటున్న ప్రజలు ఈ వర్షాలకు కారణంగా భయాందోళనకు గురవుతున్నారని వారికి ప్రభుత్వం తగిన రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

గాజువాక ఎమ్మెల్యే కనీసం ఘటనా స్థలానికి రాకపోగా, చూసి చూడనట్టు ఉండటం బాధా కరమైన విషయమని ప్రజలు వాపోతున్నారని అన్నారు.

ప్రస్తుత అధికార ప్రభుత్వం అమాయక ప్రజలను పట్టించుకోక పోయినా, జనసేన పార్టీకి వారికి అండగా ఉండి వారికి తగిన న్యాయం చేకూరేలా చేస్తామన్నారుఈ కార్య క్రమంలో జనసేన నాయకులు మజ్జి వాసు, పెతకంశెట్టి సన్యాసి నాయుడు, సాడే రామారావు, జై కుమార్, తదితర జనసైనికులు పాల్గొన్నారు.

## పడిపోయిన చెట్లను

## తొలగించిన పోలీసులు



చెట్లను తొలగిస్తున్న దృశ్యం

కొయ్యూరు : కురుస్తున్న భారీ వర్షాలకు కొయ్యూరు కేడిపేట రహదారి అడ్డంగా ఎక్కడికక్కడ భారీ వృక్షాలు నేలకూలాయి. రహదారికి అడ్డంగా పడిన చెట్ల వల్ల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో వెంటనే స్పందించిన కొయ్యూరు ఎస్సై దాసరి నాగేంద్ర మంగళవారం తన సిబ్బందితో కలిసి రహదారులపై చెట్లను తొలగించి రాకపోకలను పునరుద్దరించారు.

### అంగన్‌వాడీల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

తెర్లాం : మండలంలోని పలు గ్రామాల్లో అంగన్‌వాడీ, మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ఈ 20 లోగా దరఖాస్తులు చేసుకోవాలని బాడంగి ఐసీడీఎస్ ప్రాజెక్టు పీవో కె.రాజ్యలక్ష్మి తెలిపారు. స్థానికంగా నివాసం ఉంటున్న 21 నుంచి 35 వయసున్న వివాహితులు అర్హులన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణత ఉండాలన్నారు.

## పెద్దాపురం స్థానిక మెయిన్‌రోడ్ లో వర్షాలకు

# కుప్పకూలిన మున్సిపల్ కాంప్లెక్స్‌లో రెండు షాపులు

- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన నిమ్మకాయల చినరాజప్ప
- మున్సిపల్ అధికారులు నోటీస్లు ఇచ్చినప్పటికీ ఖాళీ చేయని 16 షాప్ ల యజమానులు
- పెద్దాపురం సోమవారం సెలవు కావడంతో అన్ని షాప్ లు మూసివేసి ఉండటంతో తప్పిన ప్రమాదం
- సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసు, రెవెన్యూ, అగ్నిమాక సిబ్బంది.





పెద్దాపురం : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పెద్దాపురం పట్టణం నందుమెయిన్‌రోడ్ నందు గల మున్సిపల్ కాంప్లెక్స్ షాపులు కుప్పకూలింది. సోమవారం పెద్దాపురం పట్టణం సెలవు కావడం వలన పెను ప్రమాదం తప్పింది. మంగళవారం పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప సంఘటన స్థలాన్ని పరిశీలించి రెవెన్యూశాఖ అధికారులకు మరియు మున్సిపల్ ఆధికారులకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో.... మాజీ మున్సిపల్ ఛైర్మన్ రాజా సూరిబాబు రాజు, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ కొరుపూరి రాజు, మాజీ మహా రాణి సత్రం ఛైర్మన్ తూతిక రాజు, పెద్దాపురం పట్టణ తెదేపా అధ్యక్షులు రంధి సత్య నారాయణ, తెదేపా నాయకులు కాకినాడ రామారావు, తాళాబత్తుల సాయి, తనారి తాతారావు, కసిరెడ్డి సత్యనారాయణ, విరోధులు రాజు మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎన్టీపీసీ రెయిన్ హార్వెస్టింగ్ చెరువు సూపర్




పరవాడ : సింహాద్రి సూపర్ థర్మల్ పవర్ ప్లాంట్ భారతదేశంలోని ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్నం నగర శివార్లలో ఉన్న బొగ్గు ఆధారిత విద్యుత్ ప్లాంట్ అని భారత ప్రభుత్వ సంస్థ ఎన్‌టిపిసి యొక్క బొగ్గు ఆధారిత విద్యుత్ ప్లాంట్లలో ఈ విద్యుత్ ప్లాంట్ ఒకటి అని ఎన్టిపిసి సింహాద్రి ఒక ఆధునిక బొగ్గు ఆధారిత విద్యుత్ ప్లాంట్, మరియు ఇది నాలుగు స్వతంత్ర యూనిట్ల కలయిక, సాధారణ నీరు మరియు ఇంధన వనరులు మరియు బూడిద చెరువులు అని ఎన్టీపిసి పిఅర్వో మల్లయ్య తెలిపారు. మంగళవారము అయనస్దానిక విలేఖర్లుతో మాట్లడుతూ ఎన్‌టిపిసి సింహాద్రిలో 2000 మందికి పైగా నివాసితులతో దీపంజలినగర్ అనే అందమైన టౌన్‌షిప్ గా ఉందిఅన్నారు. ఇది దాని నివాసితులకు సౌకర్యవంతమైన, విశాలమైన మరియు కంటెంట్ జీవితాలను అందిస్తుందిఅని ప్రాంగణం అన్ని అవసరాలు, సౌకర్యాలు మరియు సంక్షేమ అవసరాలను కలిగి ఉంది అన్నారు. దీంట్లో బాల్ భారతి పబ్లిక్ స్కూల్, జీవన్ రేఖ హాస్పిటల్ ,దీపికా లేడీస్ క్లబ్, షాపింగ్ కాంప్లెక్స్, సాగరికా రిక్రియేషనల్ క్లబ్, తరంగం ఎగ్జిక్యూటివ్స్ క్లబ్ ,సకుంతలం మరియు సంగం ఆడిటోరియం, సంయుక్త ఫంక్షన్ హాల్ కలవు అన్నారు. ఈ టౌన్‌షిప్‌లోని 2 ఎకరాలకు పైగా భూమిలో రెయిన్ హార్వెస్టింగ్ చెరువు తయారు చేయబడిందిఅన్నారు. ఇప్పుడు ఈ చెరువు మధ్య ద్వీపానికి వెళ్ళడానికి శాస్త్రీయ వంతెన వేయడం, చెరువులోకి నిరంతర నీరు, బోటింగ్ సదుపాయంతో పునర్నిర్మించబడింది అని తెలిపారు. ఎల్ ఇడి ప్రకాశం కింద చెరువు చుట్టూ జాగింగ్ సౌకర్యంకలదుఅన్నారు.ఈ చెరువు యొక్క అందం ఏమిటంటే వేప చెట్లతో పచ్చగా ఉంటుంది అన్నారు. ఈ ప్రశంస నీయమైన మరియు సాహసోపేతమైన చెరువు దీపంజలినగర్ నివాసి కోసం అతి త్వరలో సిద్ధం కానుంది అని ఎన్టీపిసిపిఅర్వో మల్లయ్య తెలిపారు.

# అనంతగిరి పూతికవలస గ్రామం లో అగ్ని ప్రమాదం

### ఇల్లుతో పాటు కాలిబూడిదైన, నగదు, ఆధార్, రేషన్‌కార్డు

అనంతగిరి : అనంతగిరి మండలంలో గల గరుగుబిల్లి పంచాయతీ చినపూతిక వలస గ్రామం లో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది స్థానికులు తెలిపిన వివరాల మేరకు తమ బైక్ కోసం తీసుకొచ్చిన పెట్రోలు ఇంటి దగ్గర ఉంచారు. ఇంట్లో ఉన్న కర్రల పొయ్యి వెలి గిస్తూ ఉండగా ఒక్కసారిగా మంటలు వ్యాపించా యని తెలిపారు. తక్షణమే గ్రామస్తులు సహా యంతో మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. కానీ ప్రయోజనం లేకపోయింది అలాగే ఇల్లు మొత్తం పూర్తిగా కాలి బూడిదై పోయిందని తెలిపారు. ఇంట్లో ఉన్న మజ్జి గంగ అనే మహిళకు తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు. ఇంట్లో ఉన్న నగదు, బట్టలు ఆధార్ కార్డు రేషన్ కార్డులు మంటల్లో కాలిపోయాయని బాధితులు కన్నీరు పర్యంతం అయ్యారు. తక్షణమే ప్రభుత్వ అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.





## వింఆర్డిఏ ప్రతిపాదిత ప్రాజెక్ట్ యొక్క ప్లానిటోరియం మ్యూజియం పై సమీక్షా సమావేశం



వింఆర్‌డిఏ : వింఆర్డిఏ ప్రతిపాదిత ప్రాజెక్ట్ ప్లానిటోరియం మ్యూజియం పై క్రియేటివ్ మ్యూజియమ్స్ డైరెక్టర్ ఎండి సుబ్రతా సేన్ మరియు అధికారులతో సహా కైలాసగిరి ను సందర్శించి సమీక్షించిన మెట్రోపాలిటన్ కమీషనర్ పి.కోటేశ్వర రావు ఐఎఎస్ మరియు అదనపు కమిషనర్ మనజిర్ జీలని సామూన్ ఐఎఎస్ ప్లానిటోరియం ప్రాజెక్ట్ కి సంబం ధించిన డిపీఆర్ తయారీ బాధ్యతలు ఎన్ఎస్ఎం అనుబంధ సంస్థ అయిన నేషనల్ కౌన్సెల్ అఫ్ సైన్స్ మ్యూజియం, మినిస్ట్రీ అఫ్ కల్చర్, గవర్నమెంట్ అఫ్ ఇండియా, కోల్కతా వారికీ అప్పగించడమైనదని తెలిపారు. మ్యూజియం డిపీఆర్ తయారీలో నిష్ణాతులైన అనుబంధ సంస్థ అని తెలిపారు. ఈ సమావేశం లో డిజైన్, సీటింగ్, డ్రోమ్ స్ట్రక్చర్, ఇతర సాంకేతిక అంశాలపై మరియు డిపీఆర్ తయారీకి కావలసిన అంశాలను సవివ రముగా చర్చించారు. డిసెంబర్ నెలాఖరులోగా డిపీఆర్ సిద్ధం చెయ్యాలని క్రియేటివ్ మ్యూసియం డిజైన్నేర్స్ వారిని కమిషనర్ గారు ప్రత్యేకముగా కోరారు. ఈ సమీక్ష లో కెలకత్తా సైన్స్ మ్యూజియం (ఎక్స్) క్యూరేటర్ డా.జీలని, చీఫ్ ఇంజనీర్ కె.రామ్ మోహన్ రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భవాని శంకర్, ఎలక్ట్రికల్ ఈఈ సోమ శేఖర్, ఉమా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇద్దరు నిందితులు అరెస్టు



విశాఖసిటీ : విశాఖపట్నం సిటీ పోలీసు కమిషనరేట్, దువ్వాడ పోలీసు స్టేషన్ పరిధిలో ఇద్దరు మైనర్ బాలికలు పై అత్యాచారం మరియు అత్యాచారయత్నం జరుగగా ఒక బాధితురాలి తల్లి ఇచ్చిన రిపోర్ట్ పై దువ్వాడ పోలీసు స్టేషన్ సిఐ టి.లక్ష్మి CR.NO. 634/2020 US. 376, 354-A IPC AND SEC 4 RAW.3(A), BR/W.T OF POCSO ACT, 2012 OF Duvvada Police Station, Visakhapatnam City గా కేసు రిజిస్టర్ చేసి పోలీస్ కమిషనర్ మనిష్ కుమార్ సిన్హా ఆదేశాలు మేరకు దర్యాప్తు నిమిత్తం దిశా మహిళా పోలీస్ స్టేషన్ సిఐ నిర్మలకి అప్పగించినారు.

**కేసు వివరాలు:** ది 10-10-2020 న 12.00 గంటలకు vilctim2 (వయసు 14 సంవత్సరాలు) తన స్నేహితురాలు ఇంటికి షీలనగర్ వెళ్ళినది. అక్కడ ఆమె మరియ vilctim1 ఉన్నప్పుడు, మహేంద్ర మరియు స్వామి (తమ వేరొక ఫ్రెండ్ కి తెలిసిన వారు) రెండు బైకులపై అక్కడికి వచ్చారు. వారు బీచ్ కు వెళ్ళదామని వారిని అడిగారు. దానికి ఇద్దరు రామని చెప్పారు. పిమ్మట ముద్దాయిలు రాజీవ్ నగర్ వద్ద రూమ్ ఉంది అక్కడికి వెళదామని అడుగగా అంతట వారు ఇద్దరు ముద్దాయిలు వచ్చిన రెండు బైకులపై వెనక కూర్చుని వెళ్లారు. అక్కడ ఆస్బెస్టాస్ రూఫ్ పెట్లో రెండు గదులు ఉన్నాయి. మహేంద్ర viictim 1 ను ఒక గదిలోకి తీసుకుని వెళ్లినాడు, గది లోపల ఆమెను బలాత్కారం చేసినాడు. అదేవిధంగా గది బయట ఉన్న viictim 2 ను స్వామి ఆమెకు ముద్దులు పెట్టి కౌగలించుకుని ఆమెను శారీరకంగా ఇబ్బంది పెట్టినాడు. అంతటviictim 2 అతనిని బలవంతంగా నెట్టివేసింది. అదే సమయంలో, viictim 1 ఏడుస్తూ గది నుండి బయటికి వచ్చి, మహేంద్ర తనను బలాత్కారం చేసినాడు అని చెప్పినది. ఆ తరువాత 11-10-2020 సిర్యాది తన కుమార్తె viictim 2 ఎందుకు లేట్ అయినది అని అడుగగా తమపై జరిగిన లైంగిక వేధింపులు చెప్పినది. అంతట viictim2 యెక్క తల్లి లైంగిక వేధింపులు చేసిన వారిపై తగు చర్యలు తీసుకోమని మరియు న్యాయం చేయమని దువ్వాడా పోలీస్ స్టేషన్లో ఒక రిపోర్ట్ సమర్పించారు. దర్యాప్తులో భాగంగా ది 12-10-2020 ది 16:30 గంటలకి కూర్మన్నపాలెం, ఆర్టీసీ బస్టాండ్ వద్ద దిశగా పోలీస్ స్టేషన్ సిఐ జి.నిర్మల వారి సిబ్బంది సహాయంతో ముద్దాయిలు రామోజు మణీంద్ర, తండ్రి ఈశ్వరరావు, వయసు 24, కులము విశ్వబ్రామిన్, ఇంటి అడ్రస్ 6-65-11, చిన గంట్యాడ, శ్రామికనగర్, గాజువాక, విశాఖపట్నం సిటీ. 2. ఉప్పరపల్లి స్వామి, తండ్రి రాజేష్ లేట్ వయసు 28, కులము విశ్వబ్రామిన్, ఇంటి అడ్రస్ 665-11, చిన గంట్యాడ, శ్రామికనగర్, గాజువాక, విశాఖపట్నం సిటి. అనే వారులను అరెస్ట్ చేసి ది 13-10-2020 నవారు ఇద్దరు ని కోర్ట్ లో హాజరు పరచటం జరిగింది. ఈ సందర్భంగా ముద్దాయిలు ఉపయోగించిన రెండు మోటర్ సైకిల్స్, మరియ రెండు సెల్ ఫోన్లు దర్యాప్తులో భాగంగా స్వాధీనపరుచుకోవటం జరిగినది. దీని నిమిత్తం డీసీపీ 2 కార్యాలయంలో పత్రికా సమావేశం ఏర్పాటుచేయడం జరిగినది. ఈ సమావేశం లో డిసీపీ 2 సురేష్ బాబు, దిశా మహిళా పోలీస్ స్టేషన్ ఏసీపీ డా.జి.ప్రేమ్‌కాజల్ మరియు సిఐ జి.నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## అచ్యుతాపురంలో వర్షపునీటిలో మునిగిన ప్రభుత్వ కార్యాలయాలు



అచ్యుతాపురం : గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు కారణంగా ప్రభుత్వ కార్యాలయాలు నీటమునిగాయి. ప్రభుత్వ కార్యాలయాలు ముందు వర్షపు నీరు చెరువులా దర్శన మిస్తుంది. కార్యాలయాలకు వచ్చే ఉద్యోగస్తులు, ప్రజలు పక్కనే ఉన్న భవితకేంద్రానికి, ప్రాధమిక ఆరోగ్యకేంద్రానికి వచ్చేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విలేకరులకు తెలిపారు. వర్షాలు వచ్చిన ప్రతిసారి ఇదే పరిస్థితి ఉంటుందని వారు వాపోయారు.

ఇప్పటికైన ఉన్నత అధికారులు స్పందించి వర్షపు నీటిని తొలగించే విధంగా, ఇటువంటి పరిస్థితి రాకుండ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

# కోరమండల్ నుంచి విషవాయువు లీక్....భయాందోళనలో స్థానికులు

### -సంస్థపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఫిర్యాదు



గాజువాక : పారిశ్రామిక ప్రాంతం శ్రీహరిపురంలోని కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ నుంచి సోమవారం అర్ధరాత్రి విషవాయువు లీక్ కావడంతో స్థానికులు అస్వస్థతకు గురయ్యారు. సంస్థ సమీపంలోని పిలకవానిపాలెం, కుంఛమాంభ కాలనీ తదితర ప్రాంతాలకు చెందిన స్థానికులు ఉక్కిరిబిక్కిరిఅయ్యారు. కళ్ళమంటలు, ఊపిరి ఆడకపోవడం, దగ్గురావడంతో ఇబ్బందిపడ్డారు. విషవాయువు వలన నలుగురు తీవ్ర అస్వస్థతకు గురికావడంతో వైద్యంకోసం 108కి కాల్ చేసి ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు, సంస్థ యాజమాన్యం, స్థానిక వైకాపా నాయకులు సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిపై ఆరా తీశారు. విషవాయువు విడుదలకు కారణమైన కోరమండల్ యాజమాన్యంపై ఆందోళనకు దిగారు. భయాం దోళనకు గురైన ప్రజలు సంస్థపై మండిపడ్డారు.





సంస్థను తక్షణమే మూసివేయా లని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుట్టుచప్పుడు కాకుండా కంపెనీ విషవాయువులను విడుదల చేస్తుందని దీనివలన చంటిపిల్లలు, వృద్దులు అస్వస్థతకు గురవుతున్నారని వాపోయారు. విషవాయువు వస్తుందని కంపినీ సిబ్బందికి ఫిర్యాదు చేసిన పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నట్లు తెలిపారు. ఒక ప్రక్క కరోనా, మరో పక్క వర్షం, దీనికి తోడు కంపెని విషవాయువు లీకు. మూడురోజులనుంచి వర్షం కురవడంతో ఇబ్బందిపడుతున్న తరుణంలో ప్రాణాంతక విషవాయువును విడుదలచేసి స్థానికుల ప్రాణాలతో చలగాటమాడడం దారుణమని కంపెని పై మండిపడ్డారు. వెంకటాపురంలోని ఎల్జీ పాలిమర్స్ గ్యాస్ ఘటనలోఎంతోమంది చనిపోయారని, అటువంటి పరిస్థితి నెలకొంటుందేమోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యాజమాన్యం కుంటిసాకులు చెబుతుందని, ఇటువంటివి పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. సంస్థపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

# ఇళ్ల స్థలాలు పేరుతో కోట్లు దోచుకుతిన్నారు

## ముంపు నీటిలో నిరసన తెలిపిన టీడీపీ శ్రేణులు

- పేదలు కు ఇచ్చే స్థలాలు ఇవేనా
- ఎమ్మెల్యే అయితే ఇల్లు ఇక్కడ కట్టుకుంటారా
- ఎమ్మెల్యే అవినీతిని బయటపెడతా
- వరుపుల రాజా



ప్రత్తిపాడు : ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ ఇళ్ల స్థలాల పేరుతో కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డారని ప్రత్తిపాడు టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త వరుపుల రాజా విమర్శించారు. ప్రత్తిపాడు నియోజకవర్గం ఎర్రవరం గ్రామంలో పేదలకు ఇచ్చిన ఎనిమిది ఎకరాల స్థలం భూములులో ఇటీవల కురుస్తున్న వర్షాలకు పూర్తిగా మునిగిపోయాయి అని ప్రజలకు ఇచ్చే ఇళ్ల స్థలాలు ఎందుకు పేదలకు పనికిరాకుండా పోయాయిఅని వరుపుల రాజా ప్రభుత్వం తీరుపై విమర్శలు గుప్పించారు. ఎర్రవరం గ్రామంలో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలు వర్షపు నీటికి మునిగిపోవడంతో వరుపుల రాజా ఆధ్వర్యంలో టిడిపి శ్రేణులు మునిగిపోయిన భూమిలో టీడీపీ శ్రేణులు ధర్నా నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఎర్రవరం గ్రామంలో మునిగిపోయిన భూములు లో నాయకులు పర్యటించి నీటిలోకి టిడిపి నాయకులువెళ్లడంతో టిడిపి నాయకులు పీకల్లోతు లో మునిగిపోయారు. మునిగిపోయిన భూముల్లో వరుపుల రాజా నిరసన వ్యక్తం చేసారు. వర్షపు నీటిలో మునిగిపోయిన భూముల్లో నుండి వరుపులరాజా మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇళ్ళ స్థలాలు పేరుతో భారీగా కోట్లు దోచుకుతింటున్నారు అని ప్రభుత్వం ,ఎమ్మెల్యే తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు.ఎకరానికి 40 లక్షల రూపాయిలు పెట్టి భూమిని కొన్నారు అని 40 లక్షల రూపాయిలు ధరలు పెట్టి కొన్నప్పటికి మరి వర్షం కాలం లో పేదలకు ఇచ్చిన స్థలాలు మునిగిపోవడం చూస్తే స్థానిక ఎమ్మెల్యే అయితే ఇక్కడ ఇల్లు కట్టుకుంటారా అని ఎమ్మెల్యే తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు.16 లక్షల విలువచేసిన భూములు ను సుమారు 40 లక్షల తో కొని కోట్ల రూపాయలు అవినీతికి పాల్పడ్డారని వరుపుల రాజా విమర్శించారు. ఇంత ధర పెట్టి కొన్నప్పటికి పేదలకు ఇచ్చిన స్థలాలు ఎందుకు మునిగిపోయాయి అని రాజా విమర్శలు గుప్పించారు.ఇక్కడ లక్షల రూపాయల తో 4 అడుగులు చదును చేశారు అని రికార్డు లో చూపించి అవినీతి కిపాల్పడ్డారు అని రాజా విమర్శించారు.4 అడుగులు చదును చేసిన పేదలకు ఇచ్చిన ఇళ్లస్థలాలు ఎందుకు మునిగిపోయాయి అని దీనికి బాధ్యత ఎమ్మెల్యే వహించాలిని రాజా అన్నారు. ఇళ్ల స్థలాలు చదును పేరుతో నియోజకవర్గంలో కోట్ల రూపాయలు ను దోచుకుతిన్నారు అని నియోజకవర్గంలో త్వరలోనే ఎమ్మెల్యే చేసిన అవినీతిని బయట పెడతాను అని వరుపుల రాజా సవాల్ విసిరారు .ఇళ్ల స్థలాలు లో అవినీతి జరిగింది అని టిడిపి నేతలు మాట్లాడితేఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక నాయకులు,అధికారులు దే బాధ్యతలు అన్నట్లు మాట్లాడం దారుణం అని ఇళ్ళ స్థలాలు జరిగిన అవినీతికి ఎమ్మెల్యే బాధ్యత వహించాలని ,ఎమ్మెల్యే పై చర్యలు తీసుకోవాలని రాజా డిమాండ్ చేశారు.ప్రభుత్వం వెంటనే ఎర్రవరం భూములు ను పరిశీలించి పేదలకు ఇచ్చిన స్థలాలు పై సమగ్ర విచారణ చేయాలని రాజా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొమ్ముల కన్నబాబు, మాజీ సర్పంచ్ బస్వాప్రసాద్, మాజీ ఎంపిటిసి కనకరావు, తోట వెంకటేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

# అదనపు ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన పట్టస్వామి సత్యన్నారాయణరావు



విజయనగరం : జిల్లా పోలీసు కార్యాలయంలో అదనపు ఎస్పీ (పరిపాలన)గా పట్టస్వామి సత్యన్నారాయణరావు బాధ్యతలను మంగళవారం స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ (పరిపాలన) పి.సత్యన్నారాయణ రావు మాట్లాడుతూ - పోలీసు కార్యాలయ పరిపాలన పరమైన నిర్ణయాలను వేగంగా తీసుకొని, త్వరితగతిన బిల్స్ మంజూరుకు చర్యలు తీసుకొంటామన్నారు. పోలీసుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చేందుకు కృషి చేస్తానన్నారు. 1989 బ్యాచ్ డైరెక్ట్ ఎస్ఐగా పోలీసు శాఖలో ప్రవేశించిన సత్యన్నారాయణ ఏలూరు రేంజ్‌లో ఎస్ఐగాను, సిఐగాను సమర్ధవంతంగా పని చేశారు. పశ్చిమ గోదావరి, విజయవాడ సిటీ, కృష్ణా, కొవ్వూరు, రాజమహేంద్రవరం లోను మరియు తెలంగాణ రాష్ట్రంలోను వివిధ హోదాల్లో పని చేసి, సమర్ధవంతమైన అధికారిగా గుర్తింపు పొందారు. బాధ్యతలు చేపట్టిన సత్యన్నారాయణ మర్యాదపూర్వకంగా జిల్లా ఎస్పీ బి.రాజకుమారిని కలిసి, పుష్ప గుచ్ఛంను అందించారు.

అనంతరం, అదనపు ఎస్పీ పి.సత్యన్నారాయణరావును పలువురు డిఎస్పీలు ఎల్. మోహనరావు, ఎల్. శేషాద్రి, పి. వీరాంజనేయ రెడ్డి, ట్రైనీ డిఎస్పీలు సుభాష్, శిరీష మరియు పలువురు సిఐలు మర్యాద పూర్వకంగా కలిసి, పుష్ప గుచ్ఛాలను అందించి, శుభాకాంక్షలు తెలిపారు.

# ఏలేరు ఆధునీకరణ పనులు చేపట్టాలి

- ముంపు ప్రాంతాల రైతులను ఆదుకోవాలి
- ఏలేరు ప్రాంతం పర్యటించిన రైతు సంఘం నాయకులు



పెద్దాపురం : ఏలేరు ప్రాంతంలో ఆధునీకరణ పనులు చేపట్టాలని, ముంపు ప్రాంతాలను ఆదుకోవాలని, నష్టపరిహారం 20 వేలు ఇవ్వాలని, కాండ్రకోట వంతెన నిర్మాణం చేపట్టాలని కోరుతూ రైతుసంఘం నాయకులు ఏలేరు ప్రాంతాన్ని పర్యటించారు. కిర్లంపూడి రామకృష్ణాపురం, ఏలేశ్వరం, ప్రాజెక్ట్, పెద్దాపురం మండలం కాండ్రకోట లో కూలిపోయిన వంతెన, కట్టమూరు, జె.తిమ్మాపురం ఏలేరు పరివాహక గ్రామాల్లో పర్యటించారు. రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ ముంపు సమస్యలు పరిష్కరించి, పంట నష్ట పరిహారాలు అందించాలని కోరారు. ఈ పర్యటనలో ఏపీ రైతు సంఘము జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తిరుమల శెట్టి నాగేశ్వరావు, గుర్రాల అప్పారావు, కౌలు రైతు సంఘ జిల్లా అధ్యక్షులు ఎమ్.రాజశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘము జిల్లా ఉపాధ్యక్షులు కె.ఎస్. శ్రీనివాస్, కె.సింహాచలం, కార్మిక సంఘాల నాయకులు కరణం ప్రసాద్, నీలపాల సూరిబాబు, కేదారి నాగేశ్వరావు, కాళ్ళ నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

# విషవాయువుల బాధితులను పరామర్శించిన బీజేపీ నేత కేఎన్ఆర్



గాజువాక : పారిశ్రామిక ప్రాంతం జీవీఎంసీ 58వ వార్డు కుంచమాంబ కోలనీ, పిలకవానిపాలెం ప్రాంతంలో సోమవారం రాత్రి కొరొమాండల్ సంస్థ నుంచి విడుదలైన విష వాయువు తో అస్వస్థతకు గురైన బాధితులను గాజువాక బీజేపి ఇంచార్జ్ కర్ణంరెడ్డి నర్సింగరావు,బీజేపీ నేతలు పరామర్శించారు. మంగళవారం సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితి పై అరా తీశారు. చిన్న పిల్లలు, గర్భిని స్త్రీ లు, ముసలివారు తీవ్ర అస్వస్థతతకు గురయ్యారని కోలనీ కమిటీ అద్యక్షులు సియ్యాద్రి సన్యాసిరావు, వార్డు బీజేపి అధ్యక్షులు లితీష్ రెడ్డి మిగతా కమిటీ సభ్యులు బీజేపి నాయకులు డా.కరణంరెడ్డి నరసింగరావుకి వివరించారు. ఈ సందర్భంగా కే.ఎన్.ఆర్ మాట్లాడుతూ జనావాసాల మద్యనుండి కోరమాండల్ ఫెర్టిలైజర్స్ కంపెనీ ని వెంటనే దూరప్రాతానికి తరలించాలని, కాలనీలకు ఆనుకొని కంపెనీ ఉండటం వలన రాత్రి పూట, మబ్బులు వున్న సమయంలో సల్ఫర్ కార్బన్డయాక్సైడ్ వంటి విషవాయువులు గాలిలోకి వదలడం వలన ప్రజలు తీవ్ర అనారోగ్యం పాలవుతున్నారని మండిపడ్డారు. కనీసం ప్రాదమిక ఆరోగ్యకేంద్రం ఏర్పాటు చేసి చుట్టుప్రక్కల కోలనీ వాసులకు పరీక్షలు చేసి, మందులు అందజేయకపోవడం దారుణమన్నారు. ఈ విషయాన్ని కంపెనీ యాజమాన్యానికి, సంబందిత అదికారుల దృష్టికి తీసుకొని వెలతామని, న్యాయం జరిగేంతవరకు తమ బారతీయ జనతా పార్టీ ప్రజల తరపున పోరాటం చేస్తుందన్నారు. తమ పార్టీ తరపున మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. బాధితులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పరామర్శించిన వారిలో బీజేపి 62వ వార్డు కార్పొరేటర్ అభ్యర్ది ఎమ్.ప్రకాష్, వార్డు ఉపాద్యక్షులు దేముడు, కమిటీ ఉపాధ్యక్షులు మహేష్, సభ్యులు రాము నాయుడు, వేణు, శేఖర్, శ్రీను, కనకరాజు, ముసలివాయుడు, రాజు, రామకృష్ణ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# బోనస్(ఎక్సిగ్రేషియా) పై ఉక్కు యాజమాన్యం నిర్ణయం

గాజువాక: స్టీల్ ప్లాంట్ యాజమాన్యం కార్మికుల బోనస్ (ఎక్సిగ్రేషియా) పై సానుకూలంగా నిర్ణయం తీసుకుందని స్టీల్ గుర్తింపు యూనియన్ అధ్యక్షులు జె. అయోధ్య రామ్ అన్నారు. మంగళవారం స్టీల్ కార్మికుల బోనస్ పై నిర్వహించిన జూమ్ సమావేశం లో సెయిల్ చైర్మన్ ఏ. కె.చౌదరితో పాటు సెయిల్ డైరెక్టర్ (ఫైనాన్స్), డైరెక్టర్ (కమర్షియల్),ఇంటక్ నుంచి సంజీవరెడ్డి సీఐటీయు నుంచి బిస్వరూప్, ఏఐటీయూసీ నుంచి డి. ఆదినారాయణ,హెచ్ ఎం ఎస్ నుంచి రాజేంద్ర సింగ్, బి ఎం ఎస్ నుంచి పనాజీ పాల్గొన్నారు. ఈ సమావేశంలో సెయిల్ చైర్మన్ చౌదరి మాట్లాడుతూ ఈ రోజు దేశ వ్యాప్తంగా ఉన్న ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా పెద్ద ప్లాంట్ లకు 15500, చిన్న ప్లాంట్ లకు 13500 బోనస్ గా చెల్లిస్తామని అంగీకరించారని ఎజె. అయోధ్య రామ్ తెలిపారు.

ఇది సెయిల్ ఉత్పత్తికి తగినంత కాదని, కానీ ఈరోజు ఉన్న ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా యూనియన్ నాయకులు అంగీకరించారని ఆయన వివరించారు.

అలాగే నేటికీ చర్చలకు కూడా పిలవకుండా ఉన్న వేతన చర్చలను ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేసినట్లు తెలిపారు.

# అంగన్వాడీ కేంద్రానికి బీరువా అందజేత



ములగాడ: పశ్చిమ నియోజకవర్గం 62వార్డు ప్రకాష్ నగర్ అంగన్వాడి కేంద్రానికి చెందిన 50 మంది గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు పౌష్టికాహారంతో పాటు, అన్ని రకాలు పండ్లను 62వార్డు బిజెపి, జనసేన ఉమ్మడి కార్పొరేటర్ అభ్యర్థి ములకలపల్లి ప్రకాష్ ఆధ్వర్యంలో, ఫ్రెండ్ యూత్ సౌజన్యంతో అందచేశారు.

అంగన్వాడీ కేంద్రానికి ములకలపల్లి ప్రకాష్ స్వంత నిధులతో ఒక బీరువాను ముఖ్య అతిథి రాష్ట్రపతి అవార్డు గ్రహీత,జాతీయ సేవ పథకం ప్రోగ్రాం అధికారిణి ఇ. పి. ఎస్. భాగ్యలక్ష్మి చేతుల మీదుగా అందచేశారు.

ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కేంద్రం సిబ్బంది, స్థానిక ప్రజలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ములకలపల్లి ప్రకాష్ సేవా కార్యక్రమాలు పట్ల హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

## ఓబులవారిపల్లి మండలంలో

# భూ అక్రమాలను అరికట్టాలి : సీపీఐ



ఓబులవారిపల్లె : కడపజిల్లా ఓబులవారిపల్లె మండలంలో జరుగుతున్నటువంటి భూ అక్రమాలు అరికట్టాలని సిపిఐ నాయకులు అన్నారు. ఈ సందర్భంగా ఓబులవారిపల్లి మండల కార్యదర్శి జ్యోతి చిన్నయ్య. మరియు చిట్వేల్ మండల కార్యదర్శి తిప్పన ప్రసాద్ మాట్లాడుతూ గతంలో ఉన్నటువంటి టి ఈశ్వరయ్య ఓబులవారిపల్లె మండలం ఎమ్మార్వో మరియు పెద్ద ఓరంపాడు విఆర్వో సుబ్బు గారి రాధమ్మ ఇరువురు కలిసి రాధమ్మ బినామి పేరుతో. 22 ఎకరాల.76 మరియు కొంతమంది చేసిన ఆన్‌లైన్‌లు 103 ఎకరాల 3 సెంట్లు. మరియు గోవింద పల్లి పంచాయతీలో19 ఎకరాల96 సెంట్లు. దళితుల భూములను భూ కబ్జాదారులకు ఒక్క ఎకరాకు 20 వేల రూపాయల చొప్పున తీసుకొని పేద వారి ఆధ్వర్యంలో ఉన్న భూములన్నీ విచ్చల విడిగా అడ్డూ ఆపూ లేకుండా బడా నాయకులకు ఆన్లైన్ చేసినారు అందు వలన మంగళవారం రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో భారీ ఎత్తున నష్టపోయిన బాధితులను కలుపుకొని ఆఫీస్ ఎదుట ధర్నా కార్యక్రమం సేసి సబ్ కలెక్టర్ గారికి ఎమ్మార్వో వీఆర్వో వాళ్లు చేసిన భూ అక్రమాలను వినతి పత్రం ద్వారా సబ్ కలెక్టర్‌కి అందజేయడం జరిగినది . సబ్ కలెక్టర్ వెంటనే స్పందించి పెద్ద ఓరంపాడు. విఆర్వో సుబ్బు రాధమ్మ మీద తగు చర్యలు తీసుకొని నిరుపేద అయినటువంటి వారికి న్యాయం చేస్తానని హామీ ఇవ్వడం జరిగినది. భారత కమ్యూ నిస్టు పార్టీ సిపిఐ వారు స్పందించి ధర్నా కార్యక్రమాన్ని విర మించడం జరిగినది. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు. జిల్లా వ్యవ సాయ కార్మిక సంఘం అధ్యక్షులు సిగి చెన్నయ్య. రాజంపేట సిపిఐ ఏరియా కార్యదర్శి ఎం.మహేష్ సిపిఐపట్టణ కార్యదర్శి దాసరి జై చంద్ర. వ్యవ సాయ కార్మిక సంఘం చిట్వేల్ మండల కార్యదర్శి కేశం ప్రసాద్. సిపిఐ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# కొరమండల్ సంస్థపై చర్యలు తీసుకోవాలి



ములగాడ: విషవాయువు విడుదలకు కారణమైన కోరమండల్ ఇంటర్నేషన్ సంస్థ పై తక్షణమే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరమండల్ సంస్థకు ఆనుకొని ఉన్న పిలకవానిపాలెం, కుంచమాంబకాలనీ ప్రజలు ఆందోళన బాట పట్టారు. సోమవారం కోరమండల్ సంస్థ విడుదల చేసిన విషవాయువు వలన నలుగురు చిన్నారులు, ఇద్దరు వృద్దులు అస్వస్థతకు గురైయ్యారు. దీంతో కోరమండల్ సంస్థపై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేస్తూ, బాధితులకు మంగళవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ గ్రామ పెద్దలు నారాయణరావు మాట్లాడుతూ తక్షణ సహాయం, నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేసారు. ప్రాణాలను తీసే విష వాయువును విడుదల చేస్తున్న కోరమండల్ సంస్థను తరలించి, ప్రజలను రక్షించాలని డిమాండ్ చేసారు. గతంలో అనేక సార్లు ఇటువంటి ఘటనలు జరిగిన విషయం కంపినీ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్ళిన ఫలితం లేదని వాపోయాకు. యాజమాన్యం వైద్యుడుని తీసుకొచ్చి కంటితుడిపి చర్యలు తీసుకున్నారని, శాశ్వత పరిష్కారం కావాలని డిమాండ్ చేసారు. ఒక ఆసుపత్రిని ఏర్పాటు చేసి బాధితులకు వైద్యం అందించాలని డిమాండ్ చేసారు. ఈ నిరసన కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా వుండాలి

## రాష్ట్ర శాసన సభాపతి తమ్మినేని సీతారాం

శ్రీకాకుళం : లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా వుండాలని రాష్ట్ర శాసన సభాతి తమ్మినేని సీతారాం తెలిపారు. మంగళవారం ఆర్.అండ్.బి. అతిథి గృహంలో స్పీకర్ పత్రికా సమావేశాన్ని ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయని, బుధవారం కూడా భారీ వర్షం పడనున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందని తెలిపారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి ఎప్పటికప్పుడు కలెక్టర్లను, ఎస్.పి.లను, క్షేత్రస్థాయి శాఖాధికారులను, తహశీల్దారులను అప్రమత్తం చేయడం జరిగిందని తెలిపారు. వర్షాల కారణంగా పంటలు, ఇళ్ళు, పశువులకు నష్టం వాటిల్లినట్లయితే, వాటిని క్షుణ్ణంగా అంచనా వేయవలసినదిగా ముఖ్యమంత్రి జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు.



రెవిన్యూ, ఇరిగేషన్, వ్యవసాయం, హౌసింగ్ తదితర శాఖలవారీగా నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి సమర్పించడం జరుగుతుందన్నారు. సముద్రతీర ప్రాంత ప్రజలను, మత్స్యకారులకు ముందస్తు హెచ్చరికలు జారీ చేసి, వారిని అప్రమత్తం చేయడం జరిగిందన్నారు.

వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసామని తెలిపారు.

పలాస, టెక్కలి రణస్థలం, లావేరు ప్రాంతాలలో తుఫాను నష్టం ఎక్కువగా వుంటుందన్నారు. వంశధార, నాగావళి, బహుద నదులలో వరద ఉధృతి వివరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తామన్నారు.

సహాయక చర్యలను తక్షణమే చేపట్టడం జరుగుతుందన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో వుండాలని ఆదేశించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంధవరపు సూరిబాబు పాల్గొన్నారు.

# జర్నలిస్టులను కోవిడ్ వారియర్స్‌గా గుర్తింపు

## కోవిడ్ భారిన పడి మృతి చెందిన జర్నలిస్టుల కుటుంబాలకు 5 లక్షలు ఆర్థిక సహాయం

### ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ దేవిరెడ్డి శ్రీనాథ్




విశాఖపట్నం : రాష్ట్రంలో కోవిడ్ బారిన పడి మృతి చెందిన జర్నలిస్టుల కుటుంబాలకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి రూ. 5లక్షలు ఆర్థిక సహాయం చెల్లించడానికి నిర్ణయించినట్లు ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ దేవిరెడ్డి శ్రీనాథ్ తెలిపారు. మంగళవారం నాడు స్థానిక వైజాగ్ జర్నలిస్ట్ ఫోరం సమావేశ మందిరంలో ఆయన పత్రికా విలేఖరుల సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవిడ్ పై పోరాటంలో "ఫ్రంట్ లైన్ వారియర్స్" గా వైద్యులు, వైద్య సిబ్బంది, పారిశుద్ధ్య సిబ్బంది, పోలీసులతో పాటు జర్నలిస్టులు కూడా ముందు వరసలో వుండి విపత్కర పరిస్థితులను ఎదుర్కొని ఇబ్బందులు పడ్డారని తెలిపారు. ఎంతోమంది పాత్రికేయులు విధి నిర్వహణలో భాగంగా కోవిడ్ వైరస్ బారిన పడి మృతి చెందారని తెలిపారు. మృతి చెందిన వారి కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించాలని ప్రెస్ అకాడమీ తరపున, జర్నలిస్టులందరి తరపున ముఖ్యమంత్రి గారిని కోరగా, ఆయన తక్షణం స్పందించి సానుకూల నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ప్రస్తుతం మృతి చెందిన ఒక్కొక్క కుటుంబానికి రూ. 5 లక్షలు ఇవ్వడానికి అంగీకరించారని ఆయన తెలిపారు.

ఇందుకు గాను ప్రెస్ అకాడమీ తరపున, జర్నలిస్టుల తరపున ఆయనకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు. అలాగే కోవిడ్ బారిన పడి చికిత్స పొందుతున్న జర్నలిస్టులకు ఇప్పటికే ఆరోగ్య శ్రీ పథకం ద్వారా వైద్యం అందిస్తున్నారని తెలిపారు. వారికి కూడా సత్వరం మెరుగైన వైద్య సౌకర్యం అందించాలని కూడా ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారని తెలిపారు.

ఇంకా ప్రతి జిల్లాలోను కోవిడ్ బారిన పడిన జర్నలిస్టులకు వైద్యం అందించేందుకు ప్రభుత్వ , ప్రైవేటు ఆసుపత్రులలో ప్రత్యేకంగా బెడ్ లను కేటాయించినట్లు ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి జర్నలిస్టుల విజ్ఞప్తిని మన్నించి, వారి కష్టాన్ని గుర్తించి జర్నలిస్టులను ఆదుకోవడానికి అన్నిరకాలుగా ప్రభుత్వం ముందుంటుందని, సానుకూల ధృక్పథంతో వ్యవహరిస్తుందని తెలిపారని అన్నారు.

కోవిడ్ బారిన పడి మృతి చెందిన జర్నలిస్టులకు కొన్నిరాష్ట్రాలలో మినహా చాలా రాష్ట్రాలలో పరిహారం చెల్లించలేదని, మన రాష్ట్రంలో జర్నలిస్టులు కోరగానే సానుకూలంగా స్పందించినందుకు ముఖ్యమంత్రికి ఆయన మరో సారి ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమాచార శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు వి.మణిరామ్, జిల్లా పౌర సంబంధాల అధికారి పి.వెంకటరాజు గౌడ్, వైజాగ్ జర్నలిస్ట్ ఫోరం అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు, ఇతరులు పాల్గొన్నారు.

**కానిస్టిట్యూషన్ ఆఫ్ పార్లమెంటరీ ఫ్రెండ్ షిప్ గ్రూప్ లో**

## విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ కి చోటు

**- వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి నామినేట్ చేసిన లోక్‌సభ సెక్రెటరియేట్**

**- ఫిన్లాండ్ కి ప్రాతినిధ్యం వహించనున్న విశాఖ ఎంపీ**



న్యూ ఢిల్లీ : కాన్స్టిట్యూషన్ ఆఫ్ పార్లమెంటరీ ఫ్రెండ్ షిప్ గ్రూప్ లో విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ కి చోటు లభించింది. ఈ మేరకు లోక్ సభ సెక్రెటరియేట్ ఈ విషయాన్ని విశాఖ ఎంపీ కార్యాలయానికి పంపింది. దీనిప్రకారం పార్టీ తరుపున ఫిన్లాండ్ దేశానికి ఎంవీవీ నామినేట్ చేయబడ్డారు . భవిష్యత్తులో ఆ దేశంతో జరిగే పలు వ్యవహారిక అంశాలపై వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున ఎంవీవీ హాజరయ్యే అవకాశం ఉంటుంది. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఈ అవకాశాన్ని ఇచ్చిన ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహనరెడ్డి , విజయ సాయి రెడ్డి, మిథున్ రెడ్డి కి ప్రత్యేకధన్యవాదాలు తెలిపారు.

**కోర్టులు న్యాయవ్యవస్థ పై ఎదురు దాడికి దిగడం**

## రాష్ట్ర ప్రభుత్వానికి సిగ్గుచేటు

**- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పేడాడ రమణకుమారి**



విశాఖ సిటీ: కోర్ట్ మీద గాని న్యాయవ్యవస్థపై న్యాయ మూర్తులు పై అవగాహన లేని ప్రభుత్వమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు పేడాడ రమణి కుమారి మంగళవారం ఉదయం అన్నారు.

న్యాయ వ్యవస్థ పై దాడి లో భాగంగానే రాష్ట్ర ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయ మూర్తికి లేఖ రాశారని, ఈ లేఖ రాయటం పై రాష్ట్ర ముందస్తు వ్యూహం అని రాష్ట్ర సుప్రీంకోర్టు జోక్యంతో హైకోర్టు పరిణామాలు మారిపోయాయని రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీర్పు వస్తున్నాయని ఆరో పెంచడంలో వాస్తవం లేదని అన్నారు. రాష్ట్ర హైకోర్టులో ప్రభుత్వానికి అన్ని విషయాలను చుక్కెదురు వలన ఏకంగా న్యాయవ్యవస్థపై ఎదురుదాడికి దిగుతుందని, సుప్రీంకోర్టు న్యాయమూర్తి పై ఫిర్యాదు చేస్తూ సీజేఐ కి లేఖ రాయడం దేశ న్యాయ చరిత్రలో చరిత్రలో ఇదే మొదటిసారి. కేంద్ర ప్రభుత్వం అండదండలు లేకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి ఇంత సాహసానికి ఒడికట్టి ఉండరని ఆమె ఒక ప్రకటనలో తెలియజేశారు.

# అంబులెన్స్ నడిపిన ఎమ్మెల్యే రోజా



విజయవాడ : నగరి ఎమ్మెల్యే, ఏపీఐఐసీ ఛైర్‌పర్సన్ ఆర్కే రోజా ఏం చేసినా సెన్సేషనే. నిత్యం ప్రజల్లో ఉండే రోజా.. నగరి ప్రజల కోసం ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నారు. తన నియోజకవర్గంలో పర్యటిస్తూ.. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ.. వాటికి పరిష్కారం చూపుతున్నారు. కొన్ని పనులు స్వయంగా చేస్తూ ప్రజలకు ధైర్యాన్ని ఇస్తున్నారు.

తాజాగా స్టీరింగ్ పట్టి అంబులెన్స్ వాహనాన్ని నడిపారు ఎమ్మెల్యే రోజా. ఆరోగ్యశ్రీ ట్రస్ట్‌కు జీటీవీ యాజమాన్యం 10 అంబులెన్స్‌లను అందజేసింది. ఈ అంబులెన్స్‌లను మంత్రి పేర్ని నాని, ఏపీఐఐసీ ఛైర్‌పర్సన్ రోజా మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రోజా స్వయంగా అంబులెన్స్‌ను నడిపారు.

# ఉత్తర నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి



## విశాఖ జిల్లా ఇంఛార్జ్ మంత్రి కురసాల కన్నబాబుకు వినతిపత్రం సమర్పించిన కె.కె.రాజు

విశాఖ సిటీ: సర్క్యూట్ హౌస్ లో విశాఖ జిల్లా ఇంచార్జ్ మంత్రి కురసాల కన్నబాబుని కలిసి నియోజకవర్గంలో ఉన్న పలు సమస్యలు,జరగవలసిన పలు అభివృద్ధి పనులపై వినతిపత్రం అందజేసి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరిన విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె రాజు. దీనిపై స్పందించిన మంత్రి కన్నబాబు మాట్లాడుతూ విశాఖ ఉత్తర నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని కేకే రాజుకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కెకె రాజుతో పాటు నియోజకవర్గంలో ఉన్న వార్డు అధ్యక్షులు, పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి వైయస్ జగన్ కు విశాఖలో జర్నలిస్టులు కృతజ్ఞతలు

**- కోవిడ్‌తో మృతి చెందిన జర్నలిస్టుల కుటుంబాలకు 5 లక్షల పరిహారం ప్రకటించడంపై సంతోషం వ్యక్తం చేసిన జర్నలిస్టులు**

**- ప్రెస్ అకాడమీ ఛైర్మన్ శ్రీనాథ్ రెడ్డి చేతుల మీదుగా కేకు కట్ చేసిన జర్నలిస్టులు**



విశాఖపట్నం : కోవిడ్ బారినపడి మృతి చెందిన జర్నలిస్టుల కుటుంబాలకు 5లక్షల పరిహారం ప్రకటించిన సీఎం జగన్మోహన్ రెడ్డికి విశాఖలో జర్నలిస్టులు కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టు లను కోవిడ్ వారియర్స్ గా గుర్తించాలని ఏపీయూడబ్ల్యూజే అభ్యర్థన మేరకు సీఎం జగన్మోహన్ రెడ్డి స్పందించడం పై జర్నలిస్టులు సంతోషం వ్యక్తం చేశారు ఈ మేరకు విశాఖ వచ్చిన ప్రెస్ అకాడమీ ఛైర్మన్ శ్రీనాథ్ రెడ్డి నీ ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ ప్రతినిధులు కలిశారు. ఆయన చేతుల మీద కేకు కట్ చేసి సీఎం జగన్ మోహన్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలియజేశారు

కొవిడ్ తో మృతి చెందిన జర్నలిస్టులకు ఐదు లక్షల రూపాయల పరిహారం ఇవ్వడమే కాక ఆసుపత్రిలో ప్రత్యేక బెడ్ లు ఏర్పాటు చేయాలని ఆదేశించినట్టు ప్రెస్ అకాడమీ ఛైర్మన్ శ్రీనాథ్ రెడ్డి తెలిపారు.

ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల విశాఖ నగర అధ్యక్షులు రావుల వలస రామచంద్రరావు మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రం సీఎం స్పందించని రీతిన సీఎం జగన్మోహన్ రెడ్డి స్పందించడం పై హర్షం వ్యక్తం చేశారు. జర్నలిస్టుల కుటుంబ సభ్యుల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే నగర అధ్యక్ష కార్యదర్శులు రావుల వలస రామచంద్ర రావు, కె చంద్రమోహన్, సీనియర్ జర్నలిస్ట్ నాగరాజు, విజయభాను బ్యూరో చీఫ్ సనపల చిన్నబాబు, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు కమాలుద్దిన్ మౌలానా, ఏసీటి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామివారికి దసరా వేడుకల ఆహ్వాన పత్రిక అందజేసిన

## ఇంద్రకీలాద్రి కనకదుర్గాదేవి ఆలయ ఈవో సురేష్‌బాబు



విశాఖపట్నం : జగద్గురు శంకరాచార్య సంప్రదాయ విశాఖ శ్రీ శారదా పీఠాధిపతులు శ్రీ శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామివారిని దుర్గా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా విజయవాడ ఇంద్రకీలాద్రి కనకదుర్గాదేవి ఆలయ ఈవో సురేష్ బాబు కలిసి దసరా వేడుకల ఆహ్వాన పత్రిక అందజేశారు. దుర్గ గుడి ఈవో తో పాటు ఆలయ ప్రధాన అర్చకుడు కోట రవికుమార్ వైదిక కమిటీ సభ్యుడు రంగావజ్జుల - శ్రీనివాస్ శాస్త్రి తదితరులు పూజ్యస్వామివారి ఆశీస్సులు గైకొన్నారు. వీరితోపాటు రాష్ట్ర దేవాలయ పాలనా సంస్థ డైరెక్టర్ ద్రోణంరాజు రామచంద్ర రావు స్వామి వారికి ఆహ్వానం పలికారు. ఆలయ అభివృది పనులకు సంబందించి ఇవో సురేషబాబుకు శ్రీ శ్రీ శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామివారు పలు కీలక సూచనలు చేసారు కరోన ప్రభావం వల్ల దసరా ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా తగు జాగ్రత్తలు తీసకోవలసినదిగా ఈ సందర్భముగా పూజ్యస్వామివారు అదేశించారు.



VIJAYABHANU - Visakhapatnam

Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com